Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 352 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 జనవరి 2024 గురువారం పేజీలు : 4

## ఇండియా కూటమి మాకు పోటీయే కాదు..

### కేంద్రమంత్రి ఆసక్తికర కామెంట్స్..

బెంగళూరు : 'ఇండియా' కూటమి కన్వీనర్‌ను ఎంపిక చేసుకోలేక మల్లగుల్లాలు పడుతున్న ప్రతిపక్షాలు ఒకవేళ అధికారమే దక్కితే ప్రధానిని ఎలా ఎన్నుకుంటారో అంటూ కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్‌పురి ఎద్దేవా చేశారు. బెంగళూరు మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమిని చూసి తాము ఏమాత్రం భయపడడం లేదని, అసలు ఈ కూటమి తమకు పోటీయే కాదన్నారు. ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లోనే ఇండియా కూటమి సత్తా తేలిపోయిందన్నారు. ఆ కూటమిలో ప్రధాని పదవికి అరడజనుమంది పోటీ పడుతున్నారని వ్యాఖ్యానించారు.



# రేవంతన్నా....

# మమ్ముల్ని కొస్త పట్టించుకోన్నా...!

## కాంగ్రెస్ సర్కార్‌లోనైనా కొలువులు వచ్చేనా...!?

## ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువత ఆవేదన!!

హైదరాబాద్ : ప్రభుత్వాలు ఎన్ని మారిన నిరుద్యోగుల భవిష్యత్తు మారడం లేదు రాజకీయ నాయకుల పదవుల కోసం నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్నటువంటి రాజకీయ నాయకులు పదవులను అనుభవిస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడడమే తప్ప ఏ ఒక్క నిరుద్యో గులకి సరైన ఉద్యోగం ఇవ్వలేని పరిస్థితులలో తెలంగాణ రాష్ట్రాన్ని గత పాలకులలాగానే ప్రస్తుత పరిపాలన కూడా అలాగేనే ఉంటుందేమో అని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులు ఆవేదనలు చేస్తున్నారు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే నిరుద్యోగులకు ఎన్నో ఉద్యోగాలు వస్తాయి అని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమాలలో పాల్గొన్నటువంటి నిరుద్యోగ ఉద్యమకారులకు ఇటువంటి శాఖలలో ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి జరిగినటువం టి ఎన్నికలలో తెలంగాణ ప్రభుత్వానికి స్వస్తి చెప్పి ఇందిరమ్మ పాలన లాంటి ప్రభుత్వం ఏర్పాటు అయితే తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ఉద్దేశంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిమరిగెలిపించుకున్నటువంటి సందర్భం తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి జరిగినటువంటి ఎన్నికల లో మార్పు రావాలని ఉద్దేశంతోనే ప్రతి ఒక్క నిరుద్యోగి తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినటువంటి నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం లోనైనా ఉద్యోగాలు వస్తాయా రావా అనే ఆలోచనలోనే ఉన్నామని తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి పరువులు నిరుద్యోగులు తెలియ జేస్తున్నారు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి నేల రోజులు గడుస్తున్నా కూడా తెలంగాణ రాష్ట్ర రైతులకు సరియైన రైతుబంధు అందించకపోవడం లోనే ఆది దిశలోనే విఫలం అవుతుందని చెప్పుకోవచ్చునని నిదర్శనమే రైతులకు మేలు చేయని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఎలా ఉద్యోగాలు ఇప్పిస్తారు అని పలువురు నిరుద్యోగులు ఆరోపణలు చేస్తున్నారు 100 రోజులలో ఆరు హామీలను అమలు చేస్తానన్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోకుండానే పరిపాలన సాగిస్తుందని పలువురు నిరుద్యోగులు నిరాశ గురి అవ్వకుండా వారికి ఆత్మహత్యలు చేసుకునే ప్రయత్నంలో కూడా ఉండవచ్చని చెప్పుకోవచ్చు గత తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే పరిపాలన సాగిస్తే మాత్రం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తుది దిశ వరకు పరిపాలన సాధించ కుండా ఉండవచ్చునని పలువురు నిరుద్యోగులు తెలియజేస్తున్నారు ఇకనైనా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగు లపై కరుణ చూపి వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించే ప్రయత్నంలోనే ఉండాలని లేకుంటే నిరుద్యోగులు ఏకమై ఉద్యమాలు చేపట్టే పరిస్థితులు ఉండవచ్చునని పలువురు నిరుద్యోగులు తెలియజేస్తున్నారు.

# టీ పీసీసీ చీఫ్ కోసం లాబీయింగ్..!

## రేసులో జగ్గారెడ్డి, జీవన్ రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి నెలరోజులు గడిచాయి. పాలనపరంగా అన్ని విభాగాలపై క్రమంగా పట్టు సాధిస్తున్నారు.

సీఎం పదవీతోపాటు టీ పీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి ఉన్నారు. 2, 3 నెలల్లో లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ లోపు టీ పీసీసీ చీఫ్‌ను నియమించాలని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తుందని విశ్వసనీయ సమాచారం. టీపీసీసీ చీఫ్ పోస్ట్ కోసం సీనియర్ నేతలు లాబీయింగ్ చేస్తున్నారు.

**జగ్గారెడ్డి, జీవన్ రెడ్డి..?** టీ పీసీసీ చీఫ్ పోస్ట్ రేసులో ముందు వరసలో ఫైర్ బ్రాండ్ జగ్గారెడ్డి ఉన్నారు. ప్రస్తుతం ఆయన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవీలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ సీటు సంగారెడ్డి నుంచి ఓడిపోయారు. లేదంటే మంత్రి పదవీ వరించేదని అతని సన్నిహితులు చెబుతుంటారు. పీసీసీ అధ్యక్ష పదవీ కోసం జగ్గారెడ్డి ఢిల్లీ వెళ్లి లాబీయింగ్ చేస్తున్నారు. అధ్యక్ష పదవీ కావాలని అడుగుతున్నారు. పదవీ ఇచ్చేందుకు వెనకాడితే తనకు ఎమ్మెల్సీ పదవీ ఇవ్వాలని జగ్గారెడ్డి అడిగే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ అయిన తర్వాత మంత్రి అవడం ఈజీ అనే సంగతి తెలిసిందే. రేవంత్ ప్రభుత్వంలో మరో ఏడు మంత్రి పదవులకు ఛాన్స్ ఉంది. అందులో ఒక పోస్ట్‌పై జగ్గారెడ్డి కన్నేసినట్టు తెలుస్తోంది. మెదక్ లోక్ సభ నుంచి కూతురు జయారెడ్డి లేదంటే సతీమణి నిర్మలకు సీటు ఇవ్వాలని కోరుతున్నారని తెలిసింది.

**వివేక్, రాజగోపాల్ రెడ్డి కూడా :** జగ్గారెడ్డి తర్వాత రేసులో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఉంటారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోవడంతో మంత్రి పదవీ మిస్సయ్యింది. తప్పకుండా బెర్త్ దక్కేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఎమ్మెల్సీగా ఉన్నప్పటికీ మంత్రిగా సీఎం రేవంత్ అవకాశం ఇవ్వలేదు. మంత్రివర్గ విస్తరణలో తీసుకుంటారనే గ్యారంటీ లేదు. టీ పీసీసీ చీఫ్ పదవీ వైపు జీవన్ రెడ్డి చూస్తున్నారు. వీరిద్దరితోపాటు గడ్డం వివేకానంద, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్లు కూడా టీ పీసీసీ చీఫ్ పోస్ట్ కోసం వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరికీ పదవీ దక్కుతుందో చూడాలి మరి.



## గద్దర్ సమాధి వద్ద డిప్యూటీ సీఎం భట్టి నివాళులు..

హైదరాబాద్, జనవరి 10: తెలంగాణ ప్రజా ఉద్యమకారుడు గద్దర్ సమాధి వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాళులర్పించారు. బుధవారం సికింద్రాబాద్ వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయం ఆవరణలో ఉన్న ప్రజాయుద్ధనౌక గద్దర్ సమాధి వద్దకు భట్టి చేరుకుని నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం హోదాలో భట్టి విక్రమార్క తొలిసారిగా ప్రజా యుద్ధనౌక గద్దర్ నివాసానికి వెళ్లి గద్దర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భట్టి విక్రమార్కను చూసి గద్దర్ భార్య గుమ్మడి విమల కంట తడి పెట్టుకొని భావోద్వేగానికి గురయ్యారు. గద్దర్ భార్య విమలను డిప్యూటీ సీఎం ఓదార్చారు. గద్దర్ అన్న కుటుంబానికి తామంతా అండగా ఉంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గద్దర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గద్దర్ భార్య విమల, కుమారుడు సూర్యం, కుమార్తె వెన్నెల.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ సీఎం వెంట ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఉన్నారు.

# ఆట మొదలైందా...?

## కేసీఆర్ సర్కార్ ఒప్పందాలపై కాంగ్రెస్ సర్కార్ గురి

## ఆ సీనియర్ ఐఏఎస్‌కు మెమో!



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణలో ఏర్పాటైన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గేర్ మార్చింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఒప్పందాలపై దృష్టి సారించింది. అవకతవకలు చోటు చేసుకున్నట్లుగా అనుమానించిన ప్రతి ఒప్పందంపైనా ఆరా తీయడం మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఫార్ములా-ఇ రేస్ అగ్రిమెంట్లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇదివరకే రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇది అక్కడితో ఆగట్లేదు. మరో అడుగు ముందుకు పడింది.

అగ్రిమెం ట్లల్లో ఉన్న లోపాలపై విచారణను చేపట్టింది. ఫార్ములా-ఇ రేసును నిర్వహించడానికి ఏకంగా 46 కోట్ల రూపాయల మొత్తాన్ని హెచ్‌ఎండీఏకు ఎందుకు మంజూరు చేయాల్సి వచ్చిందనే విషయంపై ఆరా తీస్తోంది ప్రభుత్వం. రీల్స్ చెయ్యకూడదని చెప్పిన భర్తను చంపేసిన భార్య, సోషల్ మీడియాలో రచ్చరచ్చ ! ట్యాక్స్ మొత్తాన్ని కూడా కలుపుకొంటే మరో తొమ్మిది కోట్ల రూపాయలు దీనికి అదనం. ఫార్ములా ఇ రేస్ నిర్వాహకులతో ఒప్పందాలు కూడా కుదరకముందే, హెచ్‌ఎండీఏ డైరెక్టర్ల బోర్డు ఆమోదం పొందకుండానే ఇన్ని కోట్ల రూపాయల మొత్తాన్ని హెచ్‌ఎండీఏకు బదలాయించడాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది.

ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏ మాజీ కమిషనర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌కు మెమోను జారీ చేసింది ప్రభుత్వం. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మెమొ నంబర్ 350/స్పెషల్ సీ/ఏ2/2023ని ఆయనకు పంపించారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. అరవింద్ కుమార్ హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా ఉన్నప్పుడే ఈ ఒప్పందాలు కుదిరాయని చెబుతున్నారు.

2022లో తెలంగాణ ప్రభుత్వం ఎఫ్ఐఏ ఫార్ములా-ఈ వరల్డ్ ఛాంపియన్‌షిప్ ప్రతినిధులతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఎలక్ట్రిక్ కార్ల రేసింగ్ ఇది. న్యూయార్క్, లండన్, బెర్లిన్, రోమ్, సియోల్‌లల్లో మాత్రమే ఈ ఫార్ములా-ఈ రేసింగులు సాగుతున్నాయి. వాటి సరసన హైదరాబాద్‌ను కూడా చేర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఈ రేస్‌కు ఆతిథ్యాన్ని ఇచ్చింది. గత ఏడాది ట్యాంక్ బండ్ పరిసరాల్లో ఈ రేస్ నిర్వహించారు. మలి విడతలో ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన దీన్ని జరపాల్సి ఉంది.

ఈ లోగా- ఆర్థిక అవకతవకలను చోటు చేసుకున్నట్లుగా భావించడంతో ఈ ఒప్పందాలన్నింటినీ రద్దు చేసింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. విచారణకు ఆదేశించింది.

# సంపాదకీయం

## కాంగ్రెస్‌కు పెరిగే ఓటు బ్యాంకు ఎంత..!

ఏపీలో కాంగ్రెస్ కు పెరిగే ఓటు బ్యాంకు ఎంత? ఎంత వరకు పుంజుకుంటుంది? ఇదీ ఇప్పుడు రాజకీయంగా చర్చకు వస్తున్న ప్రశ్న. 2019, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. ఆ రెండు ఎన్నికల్లో కనీసం 1 శాతం ఓటు బ్యాంకు కూడా కాంగ్రెస్‌కు రాలేదు. ఇలాంటి పరిస్థితిలో కాంగ్రెస్ ఇప్పుడు 2024 ఎన్నికల్లో పుంజుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే వైఎస్ రాజశేఖరరెడ్డి ఛరిష్మాను వినియోగించుకోవాలన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే వైఎస్ షర్మిలను ఏపీలో పార్టీకి చీఫ్‌ను చేయడం ద్వారా వైఎస్ ఓటు బ్యాంకును సాను భూతిని సొంతం చేసుకోవాలన్నది కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఆలోచనగా ఉంది. గతంలో రెండు సార్లు పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి.. క్షేత్రస్థాయిలో ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేశారు. ఇదే ఇప్పుడు వైసీపీకి దన్నుగా మారింది. ఇప్పుడు ఇదే ఓటు బ్యాంకును తిరిగి తమవైపు తిప్పుకోవాలన్నది కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. అయితే, ఇది ఎంత వరకు సాధ్యమవుతుంది? ఇప్పుడున్న పరిస్థితిలో కాంగ్రెస్ ఓటు బ్యాంకును తిరిగి తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు ఎంత వరకు సక్సెస్ అవుతాయి? అనేది కూడా సందేహంగానే ఉంది. ఎందుకంటే.. రాష్ట్రాన్ని విడదీసి.. ద్రోహం చేశారని.. ప్రత్యేక హోదాను విభజన చట్టంలో చేర్చకుండా రాష్ట్రానికి అన్యాయం చేశారని ఒక చర్చ ఇప్పటికీ నడుస్తోంది. పైకి ఎన్ని సార్లు హోదా ఇస్తామని చెబుతున్నా.. దీనిని నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. అయితే., వైఎస్ కుమార్తెగా షర్మిల తన వంతు ప్రయత్నం అయితే చేయొచ్చు. వైసీపీలో ఉన్న కాంగ్రెస్ పాత నేతలను తనవైపు తిప్పుకొనే ప్రయత్నాలు కూడా చేయొచ్చు. కానీ, ఓటు బ్యాంకు విషయానికి వస్తే మాత్రం కష్టమనే వాదన వినిపిస్తోంది. పార్టీ ఎలానూ అధికారంలోకి వచ్చే అవకాశం లేనందున.. ఆ పార్టీని ప్రజలు విశ్వసించే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ సాధించాల్సిన ప్రధాన విషయమని అంటున్నారు పరిశీలకులు. ఈ దిశగా పార్టీ అడుగులు వేసినా.. ఎన్నికలకు కేవలం మూడు మాసాల సమయం మాత్రమే ఉండడంతో కాంగ్రెస్ ఎంత వరకు పుంజుకుంటుందనేది చూడాలి.

# క్రీడలతో మానసికల్లాసం





శామీర్ పేట (గరుడ వార్త) : క్రీడలతో విద్యార్థుల్లో మానసికల్లాసం కలుగుతుందని, తద్వారా వారు మరింత ఏకాగ్రతతో విద్యను అభ్యసించే అవకాశాలు మెండుగా ఉంటాయని ఎంపీపీ యెళ్ళ బాయ్, జెడ్పిటిసి అనిత అన్నారు. బుధవారం మండల కేంద్రం శామీర్ పేట మినీ స్టేడియంలో జిల్లాస్థాయిలో జరిగిన షెడ్యూల్ కులాల వసతి గృహాల బాలబాలికలకు పలు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో రానిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. క్రీడలతో శారీరక దారిద్ర్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలలో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు.

గెలుపొందిన విజేతలు...శామీర్ పేట మినీ స్టేడియంలో జరిగిన క్రీడా పోటీలలో బాలురుల విభాగం లో కబడ్డీలో ఘట్కేసర్ వసతిగృహం మొదటి స్థానం రాగా, యాప్రాల్ వసతిగృహం ద్వితీయ స్థానం చేసుకుంది. వాలీబాల్ లో మేడ్చల్ బాలురుల వసతిగృహం మొదటి స్థానం దక్కించుకోగా యాప్రాల్ వసతిగృహం బాలురులు ద్విత్వేస్తానం కైవసం చేసుకున్నారు. ఖో ఖో లో యాప్రాల్ బస్తి గృహం బాలురులు దక్కించుకోగా ద్వితీయ స్థానం మేడ్చల్ బాలురుల వసతి గృహం చేజిక్కించుకుంది. బాలికల విభాగంలో...కబడ్డీలో దుండిగల్ బాలికల వసతి గృహం మొదటి స్థానం కైవసం చేసుకోగా మేడ్చల్ బాలికల వసతి గృహం వారు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. వాలీబాల్ లో దుండిగల్ బాలికల వసతి గృహం మొదటి దక్కించుకోగా మేడ్చల్ బాలికల వసతి గృహం వారు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఖో ఖో లో దుండిగల్ వసతి గృహం బాలికలు మొదటి స్థానం కైవసం చేసుకోగా మేడ్చల్ వసీదు గృహం బాలికలు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. అలాగే బాలికలకు, బాలురులకు షాట్ పుట్, లాంగ్ జంప్, 200 మీటర్ల రన్నింగ్ పోటీలను నిర్వహించారు. బాల బాలికలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలమని, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్. జిల్లా యూత్, స్పోర్ట్స్ అధికారి బలరాం, సహాయ ఎస్సీ అధికారి కె. శ్రీకర్ రెడ్డి, పిడిలు మురళీకృష్ణ, జి. సత్తిరెడ్డి, పీఈటీలు వెంకట నారాయణ, గోపాల చారి, రాధిక, శ్వేత, మేడ్చల్ జిల్లా షెడ్యూల్ కులాల వసతి గృహాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కాలువలను కబ్జా చేసి వెంచర్ చేస్తుంటే అధికారులు చర్యలేవి... జడ్పీ చైర్మన్




శామీర్ పేట (గరుడ వార్త) : ప్రజల సమస్యలను ప్రజా ప్రతినిధుల అధికారుల దృష్టికి తీసుకువస్తే తప్పక వెంటనే పరిష్కరించాలని, లేనియెడల కఠిన చర్యలు తప్పవని జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి అధికారులను హెచ్చరించారు. బుధవారం శామీర్ పేట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఎల్లు బాయి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సభకు జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. శామీర్ పేట గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు320, 321, 317, 319 లలో గల రైతు పొలాలకు వెళ్లే సాగునీటి కాలువాను కొందరు ప్రైవేట్ వ్యక్తులు దర్జాగా కబ్జా చేసి వెంచర్ చేస్తున్నారని, ఆరు నెలలుగా ఇరిగేషన్ శాఖ అధికారులకు, రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న పట్టించుకోవడంలేదని శామీర్ పేట ఎంపీటీసీ సాయిబాబా సభలో జడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ వాసు సమాధానం ఇస్తూ హెచ్ఎండిఏ అనుమతులు, నిబంధన మేరకే వెంచర్ చేస్తున్నారని తెలిపారు. దీంతో ఈ విషయంపై జడ్పీ చైర్మన్ స్పందిస్తూ ఆ వెంచర్లు సాగునీటి కాలువ ఉండగా ఇరిగేషన్ శాఖ అధికారులు ఎలా ఎన్వోసీ ఇస్తారని ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే ఆ వెంచర్ లోకి వెళ్లి న్యాయ విచారణ జరిపి కబ్జాకు గురైన కాలువను యధావిధిగా చేసి ఆ వెంచర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శామీర్ పేట పరిధిలోని 1233 సర్వే నెంబర్లోని రెండెకరాల ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు కబ్జా చేశారని ఈ విషయమై ప్రజావాణిలో తాసిల్దార్ కు, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని సభ దృష్టికి ఎంపిటిసి సాయిబాబా తీసుకువచ్చారు. దీనికి జడ్పీ చైర్మన్ స్పందిస్తూ రెవెన్యూ అధికారులు సభకు ఎవరు హాజరయ్యారని ప్రశ్నించగా జూనియర్ అసిస్టెంట్ వచ్చాడని తెలిపారు. దీంతో జడ్పీ చైర్మన్ సభ పక్కనే రెవెన్యూ కార్యాలయం ఉండగా తాసిల్దార్ ఎందుకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీవు ఏం చేయగలవని, సమస్యలు పరిష్కరించగలరని జూనియర్ అసిస్టెంట్ ను ప్రశ్నించాడు. వచ్చే మండల సభకు తాసిల్దార్ హాజరు కాకపోయినా, ప్రజాప్రతినిధులు సభలో తెలిపిన రెవెన్యూ సమస్యలు పరిష్కరించకపోయిన సహించేది లేదని, ఆయన స్థానంలో కొత్త తాసిల్దార్ వస్తారని జడ్పీ చైర్మన్ హెచ్చరించారు. స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం మండల కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానం చేశారు. బొమ్మరాజ్ పేట పరిధిలోని ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వెంచర్లు, గోదాములు నిర్మిస్తున్నారని ఎంపీ ఓ కు, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ఎంపీటీసీ ఇందిర సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై జడ్పీ చైర్మన్ స్పందిస్తూ అక్రమ తంతుపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని, చర్యలు ఎందుకు చేపట్టడం లేదని, వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని ఎంపీ ఓ మంగతాయారును జడ్పీ చైర్మన్ ఆదేశించారు. బొమ్మ రాసిపేట కారోబార్ లంచాలు తీసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నాడని సభలో ఎంపీటీసీ ఇందిరా ఆరోపించారు. సభలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని రెవెన్యూ అధికారి తాసిల్దార్ రాకపోవడంతో సభ్యులు తీవ్ర ఆగ్ర ఆవేశం చేశారు. సభకు పంచాయతీ కార్యదర్శులు రాలేదని ఎంపీడీవో వాణిని సభ్యులు నిలదీయగా వెంటనే స్పందించిన ఎంపీడీవో కార్యదర్శిలను పిలిపించారు. ఈ విషయంపై జడ్పీ చైర్మన్ స్పందిస్తూ మండల స్థాయిలో ఉన్న అధికారులందరూ మండల సభకు గైర్హాజరైతే సహించేది లేదని వారిపై వేటు వేస్తామని జడ్పీ చైర్మన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, జెడ్పిటిసి అనిత, వైస్ ఎంపీపీ సుజాత, విద్యుత్ శాఖ ఏడిఈ రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూ సమస్యలను పరిష్కరించాలంటూ ఉపముఖ్యమంత్రి బట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

శామీర పేట (గరుడ వార్త) :మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కలిసి గ్రామంలో ఎన్నో ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్న సర్వేనెంబర్ 20,30లో తమ భూములు ఆన్లైన్లో లేక, పట్టాదారు పాస్ పుస్తకాలు లేక అవస్థలు పడుతున్నామని వాటిని పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అందుకు ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని అన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ వెంకటరమణారెడ్డి తుము వేణుగోపాలరావు రాజేంద్రప్రసాద్ గౌడ్, జర్రిపోతుల నరసింహులు పాల్గొనడం జరిగింది



# మాస శివరాత్రి పురస్కరించుకొని ఘనంగా పూజలు

శామీర్ పేట (గరుడ వార్త) : మాస శివరాత్రి పురస్కరించుకొని ఘనంగా పూజలను నిర్వహించారు. మంగళవారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్ర



పుష్పం నిర్వహించారు. తూముకుంటకు చెందిన హరిహర భజన మండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# నూతన గదులతో విద్యకు మరింత బాసట..

శామీర్ పేట (గరుడ వార్త) : విద్యాభివృద్ధికి సహకరిస్తే దేశ అభివృద్ధికి సహకరించినట్లేనని శామీర్ పేట ఎంఈఓ వసంతకుమారి అభిప్రాయ పడ్డారు. బుధవారం శామీర్ పేట మండలం తూముకుంట ప్రాథమిక పాఠశాలలో రౌండ్ టేబుల్ వారి సౌజన్యంతో నూతనంగా నిర్మించిన రెండు గదులను ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిది




ద్దుతామన్నారు. పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. గదుల నిర్మాణానికి సహకారం అందించిన దాతలు జితేందర్ సింగ్, చేతన్ దేవ్ సింగ్, ఆదర్శ్ కుమార్లను ఎంఈఓ తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాజు యాదవ్, ప్రధానోపాధ్యాయులు కరుణ శ్రీ, వాణి, అరుణకుమారి, నిర్మల, మంజుల, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

# హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలంటూ డ్రైవర్ల డిమాండ్

శామీర్ పేట (గరుడ వార్త) : కేంద్ర ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేసి డ్రైవర్లని ఆదుకోవాలని లారీ, ట్రక్కుల డ్రైవర్లు డిమాండ్ చేశారు. బుధవారం శామీర్ పేట మండలం మజీద్ పూర్ చౌరస్తా వద్ద లారీ, ట్రక్కుల డ్రైవర్లు హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ చట్టంలో



కేంద్ర ప్రభుత్వం విధించిన రూ .7 లక్షల జరిమానా తో పాటు 10 ఏళ్ల జైలు శిక్ష దారుణం అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని రద్దుచేసి డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు శ్రీపతి నాగేష్, ఉపాధ్యక్షుడు శ్రీపతి ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి గూడెపు నరసింహ, సహాయ కార్యదర్శి జిన్నా రవి, కోశాధికారి మేడమైన సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, డ్రైవర్లు పాల్గొన్నారు

# సర్కారు బడుల్లో కంప్యూటర్ విద్య

మిర్యాలగూడ : మారుతున్న ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలోని 59 మండలాల్లో ఎమ్మార్సీలుండగా వాటి పరిధిలో ఎక్కువ మంది విద్యార్థులు చదివే గ్రామీణ ప్రాంత పాఠశాలలను ఎంపిక చేసి నూతనం గా కంప్యూటర్లు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని బడులకు వచ్చిన కంప్యూటర్లను ఎమ్మార్సీలు ఆయా పాఠశాలలకు చేరవేస్తున్నారు. కంప్యూటర్లతో పాటుగా ప్రింటర్లు, 2కేవీ యూపీఎస్, ఎంఎస్ ఆఫీస్ సాఫ్ట్‌వేర్, స్విచ్ బోర్డులు, కేబుల్ వైర్లు, జాక్ ప్యానెల్ను అందించను న్నారు. పాఠశాలలకు కంప్యూటర్లు చేరుకున్న తరువాత నిర్ణీత సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసి సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకువస్తారు.బోధకులను నియమిస్తేనే ప్రయోజనం

మొదటిసారి 2006లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించాలనే లక్ష్యంతో ఎంపిక చేసిన పాఠశాలలకు సామగ్రి అందజేశారు. కొంత కాలం పార్ట్‌టైం ఉపాధ్యాయులతో బోధన చేపట్టారు. పూర్తిస్థాయిలో బోధకులు లేకపోవడం, కంప్యూటర్ల మరమ్మ తులకు గురైనా పట్టించుకోక పోవటంతో అన్నీ మూలకుచేరాయి. చాలాచోట్ల కంప్యూటర్లను ఉపాధ్యాయులు పాఠశాల అవసరాలకు వినియోగిస్తున్నారు. ఈసారైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు ముందస్తుగా సాంకేతిక విద్యాబోధకుకు ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులను నియమిస్తే ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు



కోరుతున్నారు.

విద్యార్థుల వారీగా కేటాయింపు

దాదాపు పదిహేనేళ్ల తరువాత ప్రభుత్వ పాఠశాలలకు మరోసారి కంప్యూటర్లు అందిస్తున్నారు. వందలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఐదు కంప్యూటర్లు, 101 నుంచి 200 లోపు ఉంటే ఎనిమిది, 201 పైగా విద్యార్థులున్న పాఠశాలకు పది కంప్యూటర్లు అందించేలా ప్రతిపాదించారు. వీటిని పాఠశాలల్లో అమర్చిన తరువాత డిజిటల్ బోధనకు, విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ చేసేందుకు ఉపాధ్యాయులు వినియోగించనున్నారు.

పాఠశాల దశలోనే కంప్యూటర్‌పై పూర్తి అవగాహన

భిక్షపతి, జిల్లా విద్యాశాఖాధికారి నల్గొండ

పాఠశాలలకు ఇచ్చే కంప్యూటర్లతో విద్యార్థులకు పదోతరగతి లోపుగానే వాటిపై పూర్తి అవగాహన కల్పించవచ్చు. వీటిని వందశాతం వినియోగించుకునేలా విద్యార్థులకు బోధన సాగించేలా చూస్తున్నాం. మారుతున్న ఆధునిక పరిస్థితుల్లో విద్యార్థులకు కంప్యూటర్‌ను సులువుగా నేర్చుకునే వీలుంటుంది.

# రాయితీ పిలుపు.. ఈ-చలాన్ల చెల్లింపు

సూర్యాపేట : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు పోలీసులు విధించిన ఈ-చలాన్లపై ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో స్పందన కనిపిస్తోంది. పన్నెండు రోజుల్లో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో మొత్తం రూ.2.62 కోట్ల ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరడం విశేషం. రోడ్డు నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు పోలీసు శాఖ గతంలో విధించిన జరిమానాలు భారీగా పేరుకుపోయాయి. వీటి వసూలుపై దృష్టిసారించిన ప్రభుత్వం ఇటీవల రాయితీలను ప్రకటించిన విషయం విదితమే. ఇప్పటి వరకు విధించిన మొత్తం జరిమానాలో ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం, ద్విచక్ర వాహనాలపై 80, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు కార్లు, జీప్‌లు, ట్యాక్సీలపై 60, భారీ వాహనాలపై 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రాయితీ డిసెంబరు 26 నుంచి అమలులోకి వచ్చింది.

అవగాహన పెంచేందుకే..

సూర్యాపేట జిల్లాలో ఈ ఏడాది 2,70,075 మంది వాహనదారులకు రూ.7.45 కోట్ల జరిమానా విధించారు. గత కొన్నేళ్లుగా జిల్లాలో 6,96,030 వాహనాల కేసుల్లో రూ.21.94 కోట్లు బకాయిలు



పేరుకుపోయాయి. రాయితీ కల్పించిన పన్నెండు రోజుల్లో సూర్యాపేట జిల్లాలో 1,13,632 మంది వాహనదారులు రూ.1.44 కోట్లు చెల్లించారు. వాహనదారుల్లో అవగాహన పెంచేందుకు ఆ శాఖ రాయితీలు కల్పిస్తోంది.

సమీపించిన గడువు

నల్గొండ జిల్లాలో గడిచిన ఏడాదిలో 1,72,648 వాహన కేసులు నమోదు చేసి రూ.6.34 కోట్ల జరిమానా విధించారు. రాయితీ ప్రకటించడంతో గత నెల 26 నుంచి ఈ నెల 6 వరకు 74,648 మంది వాహనదారులు వచ్చి రాయితీని సద్వినియోగం చేసుకున్నారు. వీరి ద్వారా రూ.1.18 కోట్ల నగదు ప్రభుత్వానికి ఆదాయంగా వచ్చింది. రాయితీ చెల్లించేందుకు ప్రభుత్వం ఈనెల 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆ లోగా వాహనదారులు పెండింగ్ చలాన్లు చెల్లించి రాయితీలు పొందాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బకాయిల వసూలుకు రాయితీ సదుపాయం

-రాహుల్ హెగ్డే, సూర్యాపేట జిల్లా ఎస్పీ

కొన్నేళ్లుగా పేరుకుపోయిన వివిధ రకాల వాహనాల ట్రాఫిక్ చలాన్లను వసూలు చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం రాయితీ సదుపాయం కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పెండింగ్ చలాన్లు చెల్లించాలి. ఈ నెల పదో తేదీ వరకు అవకాశం ఉంది. వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి.

# వృథా జలాలకు అడ్డుకట్ట



జగిత్యాల : గోదావరి నదిలో వృథా జలాలకు అడ్డుకట్ట వేసేందుకు బ్యారేజీల నిర్మాణంపై అధికారులు సర్వే చేపడుతున్నారు. రాయికల్, బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లో గతంలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు ఏటా వేసవిలో గోదావరిలో నీటి ఎద్దడితో పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇటీవల ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి గోదావరి తీరంలో బ్యారేజీ నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి తక్కువ వ్యయంతో ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉన్న ప్రాంతాల్లో గోదావరి నదిపై బ్యారేజీల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. ఇందుకు అనుగుణంగా గోదావరి తీర ప్రాంతంలో బ్యారేజీ నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు సర్వే పనులు చేపట్టి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. గోదావరి నీటి నిలువ చేసుకున్నట్లయితే ఇక్కడి ప్రాంతానికి అనువుగా ఉండడమే కాకుండా అవతలివైపు మంచిర్యాల జిల్లా రైతులకు కూడా సాగునీటి సమస్య పరిష్కారం కానుంది.

చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీరు

సారంగాపూర్ మండల కేంద్రంలోని చింతల చెరువులోకి నేరుగా డీ-53 ప్రధాన కాలువ ద్వారా ఎస్సారెస్పీ నీటిని నింపేందుకు అధికారులు సర్వే నిర్వహించారు. దీనికి పెంబట్ల నుంచి నేరుగా కిలోమీటర్ ద్వారా అటవీ ప్రాంతం నుంచి కాలువ తవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా చెరువు కట్ట మరమ్మతు, పూడికతీత, ఎత్తు పెంచినట్లయితే రూ.3 కోట్ల వ్యయంతో దాదాపు అర టీఎంసీ నీటిని నిలువ చేసుకునే అవకాశం ఉంది. దీని ద్వారా సారంగాపూర్‌తోపాటు బట్టపల్లి, పోతారం, నేరెళ్ల గ్రామాల రైతులకు సాగు నీటి సమస్య తీరనుంది.

మూడు టీఎంసీల నీటి నిల్వ

గోదావరి నదిపై రెండు బ్యారేజీల నిర్మాణం చేపడితే 3 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఏర్పడుతుందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఒక్కో బ్యారేజీ నిర్మాణానికి రూ.250 కోట్ల వ్యయం అవుతుందని అంచనాకు వచ్చారు. నీటి నిల్వతో పాటు సాగు, తాగునీటి సమస్య కూడా తీరుతుందని భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా నీటి పారుదలశాఖ అధికారులు మొసల్ల మడ్గు ప్రాంతం, కొల్వాయి-ఆరేపల్లి గంగామాత ఆలయవద్ద, కమ్మునూర్- రేకులపల్లె ప్రాంతాల్లో బ్యారేజీ నిర్మాణానికి అనువుగా ఉంటుందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ నెల 9న డ్రోన్ కెమెరాతో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్వే అనంతరం నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి, ప్రభుత్వానికి నివేదించనున్నారు.

ఎత్తిపోతల పథకాల సద్వినియోగం

బ్యారేజీ నిర్మాణాలతో గోదావరి తీర ప్రాంతంతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రానున్నాయి. బీర్‌పూర్ మండలంలో ఇప్పటికే మంగెళ, కమ్మునూర్, రేకులపల్లె, చిన్న కొల్వాయి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు పనిచేస్తుండగా, రంగసాగర్, చిత్రవేణిగూడెంలో మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఒక్కో పథకానికి దాదాపు రూ.కోటి వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనాలు తయారు చేశారు. నిరుపయోగంగా ఉన్న చిత్రవేణిగూడెం, రంగసాగర్, జగన్నాథపూర్ ఎత్తిపోతల పథకాలకు రూ.1.50 కోట్ల వ్యయం అవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేశారు.సర్వే కొనసాగుతుంది

- చక్రునాయక్, డీఈఈ, నీటిపారుదల శాఖ

గోదావరిపై బ్యారేజీ నిర్మాణానికి పలు ప్రాంతాల్లో సర్వే కొనసాగుతోంది. దాదాపు రూ.500 కోట్లతో రెండు బ్యారేజీలు నిర్మిస్తే దాదాపు మూడు టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వేసవిలో సాగునీటి సమస్యలేకుండా ఎత్తిపోతల పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునే వీలు ఏర్పడుతుంది. వీటితోపాటు ఎత్తిపోతల పథకాలకు పూర్తి స్థాయిలో మరమ్మతు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

# గొర్రెలొద్దు.. డబ్బులు తిరిగి ఇవ్వండి!



భువనగిరి : గొర్రెల పంపిణీ పథకం అమలులో జాప్యం నెలకొంది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో పథకం అమలులో ఉంటుందో లేదో అని పథకం లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. తమ వాటా డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. లబ్ధిదారుడి వాటా కింద రూ.43,750 చెల్లించిన 20 మంది డబ్బులు తిరిగి చెల్లించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి చుట్టూ చక్కర్లు కొడుతున్నప్పటికీ అధికారులు డబ్బులు తిరిగి చెల్లించే విషయమై స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పథకం అమలు తీరు ఇలా...

గొర్రెల పంపిణీ పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 34,045 మంది లబ్ధిదారులను అర్హులుగా అధికారులు గుర్తించారు. రెండు విడతల్లో 20,330 యూనిట్లు పంపిణీ చేశారు. మునుగోడు శాసనసభ ఉప ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో అప్పట్లో గొర్రెలను పంపిణీ చేశారు. తదుపరి సార్వత్రిక ఎన్నికలు వస్తున్నాయని తిరిగి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. పథకం ప్రారంభంలో గుర్తించిన లబ్ధిదారుల్లో ఇంకా 13,715 మందికి పథకం వర్తింపజేయాల్సి ఉంది. 342 మంది 18 నెలలుగా తమ వాటా ధనం చెల్లించి పథకం లబ్ధికి నిరీక్షిస్తున్నారు. కొద్ది సంవత్సరాల క్రితం ప్రభుత్వం యూనిట్ విలువను రూ.1.75 లక్షలకు పెంచింది. ఇందులో లబ్ధిదారుడి వాటా రూ.43,750 కాగా మిగతా మొత్తం రాయితీగా అందిస్తున్నారు. లబ్ధిదారులు తమ వాటా ధనాన్ని డబ్బుల రూపంలో తమ ఖాతాల నుంచి యాక్సిస్ బ్యాంకులోని కలెక్టర్ ఖాతాలోకి జమచేశారు. శాఖాపరంగా ఆదేశాలు లేని కారణంగా డబ్బులు తిరిగి చెల్లించలేని పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని తన ఎన్నికల ప్రణాళికలో చేర్చింది. దీంతో పథకం కొనసాగుతుందన్న ఆశలు ఉన్నాయి.

ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం-డాక్టర్ కృష్ణ, జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి

పథకం అమలు విషయమై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. 20 మంది తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 342 మంది తమ వాటాగా డబ్బులు చెల్లించిన వారు ఉన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని వారు చేస్తున్న డిమాండ్‌ను తమ శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. పై అధికారి నుంచి వచ్చిన ఆదేశాలను జిల్లా ఉన్నతాధికారి కలెక్టర్‌కు వివరించి నిర్ణయం తీసుకుంటాం.

# సర్వే కట్టుదిట్టం.. మరుగుదొడ్లు శుభ్రం

సూర్యాపేట : పురపాలికల్లో స్వచ్ఛతపై అధికారులు దృష్టిసారించారు. జిల్లాలోని ఐదు పురపాలికల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. పారిశుద్ధ్యం నిర్వహణతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ప్రాంతాల్లోని మరుగుదొడ్ల వినియోగంపై సర్వే చేశారు. వాటి ఆధారంగా పురపాలికలకు ర్యాంకులు ప్రకటించే అవకాశం ఉండటంతో మున్సిపాలిటీలో వాటిపై దృష్టిసారించా యి. అందులో భాగంగా ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్, ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ ధ్రువపత్రాలు పొందాయి. వాటితోనే పరిమితం కాకుండా తాజాగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ క్లీన్ టాయిటెల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

మహిళా సంఘాలతో సర్వే

పురపాలికల్లో నిర్వహించిన క్లీన్ టాయిలెట్ ఛాలెంజ్ సర్వేకు స్వశక్తి మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేశారు. మెప్మా ద్వారా జిల్లాలోని పురపాలికల్లో వారికి శిక్షణ ఇచ్చారు. వారు పురపాలికల్లోని సులభ్ కాంప్లెక్స్‌లు, సామూహిక మరుగుదొడ్ల వివరాలు సేకరించారు. వీరు ప్రతి సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లి ఫొటో, 40 సెకన్ల నిడివి గల వీడియో తీసి స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ సర్వే గత సోమవారం ముగిసింది.వినియోగంలోకి జిల్లాలోని ఐదు పురపాలికల్లో క్లీన్ టాయిలెట్ సర్వేతో మరుగుదొడ్లు, మూత్రశాలలు వినియోగంలోకి వచ్చాయి. మొత్తం 252 మరుగుదొడ్లను శుభ్రం చేయడంతో పాటు మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చారు. పట్టణాలకు వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వారు మలమూత్ర విసర్జనకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. క్లీన్ టాయిలెట్ కార్యక్రమంలో చాలా మరుగుదొడ్లు వినియోగంలోకి రావటంతో ఆ ఇబ్బందులు తీరనున్నాయి.విజయవంతంగా సర్వే చేపట్టాం-రామాంజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

పురపాలికల్లో క్లీన్ టాయిలెట్ సర్వేను విజయవంతంగా చేపట్టాం. ఈ సర్వేతో మున్సిపాలిటీలోని మరుగుదొడ్లు, మూత్రశాలలు వినియోగంలోకి వచ్చాయి. కొన్నిచోట్ల సరైన వసతులు లేకపోవటంతో వెంటనే కల్పించి వాడకానికి అనుగుణంగా సిద్ధం చేశాం.

# నవోదయ పిలుస్తోంది..!

సూర్యాపేట : నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరడానికి ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు కలిపి నల్గొండ జిల్లా చలకుర్తిలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. ఈ పరీక్షకు హాజరయ్యేందుకు ఉమ్మడి జిల్లా నుంచి 4,623 దరఖాస్తులు అందగా మొత్తం 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 20వ తేదీ శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏవైనా సమస్యలుంటే చలకుర్తిలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో తెలిపి సవరించుకోవచ్చని అధికారులు తెలిపారు. పరీక్షకు సంబంధించిన మెటీరియల్, పాత ప్రశ్నపత్రాలు నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్‌సైట్‌లో లభిస్తాయని వారు పేర్కొన్నారు.

అర్హతలు ఉమ్మడి జిల్లాకు చెందిన, ప్రస్తుతం ఐదో తరగతి చదువుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాత్రమే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలి. ఆరో తరగతిలో 80 సీట్లుండగా ప్రవేశ పరీక్షలో వచ్చిన



మార్కుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లలో 15 శాతం ఎస్సీ, 7.50 శాతం ఎస్టీ, 27 శాతం ఓబీసీ, 33.33 శాతం బాలికలకు, మిగిలినవి జనరల్ కేటగిరీ కింద రిజర్వ్ చేశారు.

సీటు కోసం దళారులను ఆశ్రయించొద్దు-నాగభూషణం, ప్రిన్సిపల్, జవహర్ నవోదయ విద్యాలయం, చలకుర్తి ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. 25 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులు, 24 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున నియమించాం. వారందరికీ త్వరలో జిల్లా విద్యాధికారి పర్యవేక్షణలో శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. సీటు కోసం విద్యార్థుల తల్లిదండ్రులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ల ప్రకారం మాత్రమే సీట్లు కేటాయిస్తాం. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్‌తో పాటు తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి ధ్రువీకరణ పత్రం, ఫొటోతో హాజరుకావాలి.

# రాత్రి వేళ.. తపాలా సేవ

ఖమ్మం : ఖమ్మం నగరం స్టేషన్ రోడ్డు ప్రధాన తపాలా కార్యాలయం, రైల్వే స్టేషన్‌లో ఉన్న ఆర్ఎంఎస్ (రైల్వే మెయిల్ సర్వీస్) కార్యాలయాల్లో 'నైట్ పోస్టాఫీస్' పేరుతో సేవలను తపాలాశాఖ అమలు ప్రధాన చేస్తోంది. కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ సాయంత్రం 4 నుంచి 7.30 వరకు ఉంటుంది. రైల్వే స్టేషన్‌లోని ఆర్.ఎం.ఎస్. కార్యాలయంలో సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండాలనే నిబంధన ఉంది. ఈ వేళలు అమలు కావడం లేదు. రాత్రి తపాలా సేవల్లో ఆర్థిక లావాదేవీలకు సంబంధం లేని అన్ని సేవలు అందుబాటులో ఉంటాయి. తపాలా బిళ్లల విక్రయం, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, పార్సిల్ బుకింగ్ వంటివి అత్యవసరంగా వినియోగించుకునే వారి సౌలభ్యం కోసం ఈ సేవలను తపాలా శాఖ ప్రవేశపెట్టింది. చాలావరకు వీటి గురించి ప్రచారం లేకపోవడంతో వినియోగదారులు 4 గంటల తర్వాత రావడం లేదు. ఖమ్మం నగరంలో కేవలం రెండు తపాలా కేంద్రాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉందనే విషయం కొన్ని ప్రభుత్వ శాఖలకు మాత్రమే తెలుసు. వారు సాయంత్రం 5 గంటల తర్వాత ప్రధాన కార్యాలయంలో తమ పనులు పూర్తి చేసుకొని వెళ్తున్నారు. ఈ కార్యాలయానికి కొందరైనా వచ్చి ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇక రైల్వే ప్రయాణాలు చేసే వారి సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఆర్.ఎం.ఎస్.లో రాత్రి సేవలు దాదాపుగా లేవు. ఖమ్మం రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న ఆర్.ఎం.ఎస్. కార్యాలయ ప్రాంగణంలో బయటి వైపు ఉన్న కౌంటర్ తలుపులు తెరవడం లేదు. బయటి వారు స్టేషన్-1 ఫ్లాట్‌పాం లోనికి వెళ్లి అక్కడి కౌంటర్ వద్దకు వెళ్లలేరు. క్రమంగా ఇక్కడ రాత్రి తపాలా సేవల సమాచారమే మరుగున పడింది. సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ఇచ్చిన సదుపాయాన్ని ప్రజలు వినియోగించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు తపాలా పార్సిల్ సేవలను వినియోగించుకుంటున్నాయి. ఆర్.ఎం.ఎస్. కార్యాలయం బయటి కౌంటర్ ప్రారంభిస్తే వినియోగదారులకు సౌలభ్యం కోరుతున్నారు.

# కొలువులపై కొత్త ఆశలు

ఖమ్మం : నిరుద్యోగానికి కొత్తదారులు సమాధానం చెబుతున్నాయి. ప్రభుత్వ కొలువులు వస్తాయనే ఆశతో వాటిని సాధించేందుకు యువత సిద్ధమవుతూనే ఉంది. అనువైన కొలువు, తగిన వేతనం ఉంటే ఎంత దూరమైనా వెళ్లేందుకు సిద్ధపడుతోంది. ఇందుకు ప్రభుత్వపరంగా సహకారం అందించే సంస్థలూ ఉన్నాయి. ఉపాధి కల్పనశాఖ ఇప్పుడు ఇదే బాటలో పయనిస్తోంది. జాబ్‌మేళాలు నిర్వహించడం ద్వారా కొలువులు చూపుతున్నప్పటికీ అక్కడ వస్తున్న అవకాశాలకు, వాటి వేతనాలకు పొంతన లేకపోవడంతో ఇక్కడ లభించే ఉద్యోగ అవకాశాలపై ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య తగ్గుతోంది.

17,714 మంది నమోదు జిల్లా ఉపాధి కల్పనాశాఖలో 17,714 మంది నమోదై ఉన్నారు. ఇందులో పదో తరగతి చదువుతో ఉద్యోగాల కోసం చూస్తున్న వారు 3,608 మంది, ఇంటర్ విద్యార్హతతో 4,778, డిగ్రీ పూర్తి చేసిన వారు 5,423, పారా మెడికల్ 257, ఐటీఐ 1,089, అన్‌స్కిల్డ్ 988, టైపింగ్ 223 మంది నమోదు చేసుకున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పారామెడికల్, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ కోర్సులు చేసిన వారు జిల్లాలో 87 వేల మంది వరకు ఉంటారనే అంచనాలు ఉన్నాయి. వీరిలో ప్రభుత్వ కొలువుల కోసం ఎదురు చూస్తునే కార్పొరేట్ సంస్థల్లో అవకాశాలు వస్తే చేరుతున్నారు.

పరిశ్రమల ఏర్పాటే పరిష్కారం

జిల్లాలో విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులు ఉన్నా వారికి తగిన అవకాశాలు కల్పించే సంస్థలు, పరిశ్రమలు ఏర్పాటు కావడం లేదు. ఐటీ హబ్ ఉన్నా కార్పొరేట్ సంస్థలు వచ్చేందుకు అనువైన పరిస్థితులు లేక కేవలం స్టార్టప్ సంస్థలు మాత్రమే కొలువుదీరుతున్నాయని నిపుణులు వివరించారు. ఐటీ రంగంలో హైదరాబాద్ తర్వాత ఖమ్మం నుంచి ఉద్యోగులు భర్తీ అవుతున్నందున ఖమ్మం నగరంలో ఐటీ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడితే 70 శాతం నిరుద్యోగానికి పరిష్కారం లభిస్తుందని నిపుణులు సూచించారు.

పాస్‌పోర్టు తీసుకొని...గత ఏడాది ఖమ్మం పాస్‌పోర్టు కార్యాలయంలో 19,728 మంది నమోదై పాస్‌పోర్టులు పొందారు. వీరంతా విదేశీ కొలువుల కోసం వేచి ఉన్నారు. ఇందులో కొందరు ఇప్పటికే అమెరికా, ఇంగ్లాండ్ దేశాలు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. విదేశాలకు వెళ్లి అనతికాలంలో ఆర్థికంగా స్థిరపడిన వారిని స్ఫూర్తిగా తీసుకొని యువత ఆ వైపు అడుగులు వేస్తోంది. ఉపాధి కల్పనాశాఖకు అనుబంధంగా ఉన్న టామ్‌కామ్ సంస్థ అన్ని విద్యార్హతల వారికి విదేశీ కొలువుల అవకాశాలు కల్పిస్తుండగా అటుగా ఆసక్తి చూపుతున్నవారి సంఖ్య పెరిగింది. ఇటీవల వారు నిర్వహించిన నమోదు కార్యక్రమంలో 359 మంది చేరారు. పారా మెడికల్ కోర్సులు చేసినవారికి జపాన్, జర్మనీ దేశాల్లో కొలువులు ఉంటున్నాయి.

# అందితే నిధులు.. చేరుతాయి జలాలు..!



బషీరాబాద్ : జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ పట్టనుంది. గలగలా నీరు పారేలా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. చెరువులు, భారీ ప్రాజెక్టులకు చేపట్టాల్సిన మరమ్మతులు, తదితరాలకు అవసరమయ్యే రూ.200 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధంచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా సాగునీటి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులు, చెరువులను పరిశీలిస్తున్నారు.

1,196 చెరువులు ఆయా మండలాల్లో అన్నీ కలిపి 1,196 చెరువులున్నాయి. వీటికి దశాబ్దాలుగా మరమ్మతులు లేకపోవడంతో నీరు వృథా అవుతోంది. వీటిని బాగు చేసేందుకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇటీవల అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు.

ఎత్తిపోతల బాగుకూ చర్యలు

జిల్లాలో నాలుగు ఎత్తిపోతల పథకాలున్నాయి. కాగ్నానదికి ఒడ్డున నీటిని ఒడిసిపట్టి రైతులకు సాగునీరందించాలనే ఉద్దేశంతో బషీరాబాద్ మండలంలో నవాంద్గీ, జీవన్గీ, ఇందర్‌చేడ్, ధారూరు మండలం దోర్నాల్‌లో ఒకటి మొత్తం కలిపి నాలుగు ఉండగా. ప్రస్తుతం నాలుగూ పడావుగా ఉన్నాయి. నవాంద్గీ ఎత్తిపోతల పథకం నాలుగేళ్ల క్రితం రూ. కోటి ఖర్చు చేసి బాగు చేసినా విద్యుత్ సమస్య ఉత్పన్నం కావడంతో మళ్లీ మొదటికొచ్చింది. వీటి బాగుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

తీరనున్న సాగునీటి కష్టాలు..

ప్రణాళికలకు తగినట్లు జిల్లా ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుచేయిస్తే జిల్లా నీటి వనరులు సాగునీటితో కళకళలాడతాయి. గతంలో కోట్‌పల్లి ప్రాజెక్టు నీటితో వరి, వేరుసెనగ, పంటలు సాగు చేసుకొని మూడు మండలాల రైతులకు ఏడాదంతా పొలాల్లోనే గడిపేవారు. ప్రస్తుతం నీరు లేక భూములు పడావుగా పెట్టుకుంటున్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ.130కోట్ల అంచనా

జిల్లాలో పెద్దప్రాజెక్టుగా ఉంది.. కోట్‌పల్లి జలాశయం. ఈ ప్రాజెక్టుకు పర్యాటక ప్రాంతంగా కూడా గుర్తింపు ఉండటంతో సందర్శకులు సైతం ఎక్కువగా వస్తుంటారు. ప్రస్తుతం కోట్‌పల్లి ప్రాజెక్టులో రెండు కాల్వలు, కట్ట, తూములు, ఇతర నిర్మాణాలు చేయాల్సి ఉంది. వీటి కోసం సుమారు రూ.130 కోట్ల ఖర్చు అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సర్పన్‌పల్లి, లక్నాపూర్ ప్రాజెక్టులకు సైతం సుమారు రూ.40 కోట్ల వరకు మరమ్మతులకు అంచనా వేశారు. పెండింగ్‌లో ఉన్న శివసాగర్ ప్రాజెక్టు, మైల్వార్ అక్కాలమ్మ చెరువు.. ఇలా పెద్ద చెరువులు అన్నీ కలిపి రూ.200 కోట్లకుపైగా అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

నీటి కష్టాలు తీరతాయి– సుందర్, ఈఈ సాగునీటి శాఖ, వికారాబాద్

ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ఇందుకోసం భారీ అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరైతే జిల్లాలో సాగునీటికి కష్టాలు తీరుతాయి.

# విచారణ చేయరు.. ఆక్రమణదారులను తొలగించరు

గంభీరావుపేట : మండల కేంద్రంలో రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అర్హులకు ఇవ్వలేదంటూ ఇప్పటికీ దరఖాస్తుదారులు రోడ్లపై నిరసన తెలుపుతున్నారు. మరోవైపు కొందరు ఖాళీగా ఉన్న ఇళ్లను ఆక్రమించుకున్నా పట్టించుకున్న నాథుడు లేడు. అధికారులు విచారణ చేపట్టి నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని కోరుతున్నా స్పందన లేకపోవడంతో అర్జీదారులు ఆందోళన చెందుతున్నారు.గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీలో రెండు పడక గదుల ఇళ్లు 272 నిర్మించారు. బీసీ కాలనీలో 168, ఎస్సీ కాలనీలో 104 ఇళ్లను కట్టారు. నిజమైన అర్హులను ఎంపిక చేయాలని దాదాపు నాలుగైదు సార్లు గ్రామ సభలు నిర్వహించారు. మొదటి జాబితాలో ఉన్న పేర్లు రెండో జాబితాలో లేవు. రెండో జాబితాలో ఉన్న పేర్లు మూడో జాబితాలో లేకపోవడంతో దరఖాస్తు చేసుకున్న అర్జీదారులు ఆందోళన చెందారు. గ్రామ సభల్లో అర్హుల జాబితా ప్రకటించకపోవడం, గ్రామ పంచాయతీలో పెట్టకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించిన తీరును పేదలు తప్పుబడుతున్నారు. ఇటువంటి గందరగోళం మధ్యనే అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సెప్టెంబర్ 28న రెండు పడక గదుల ఇళ్లను ప్రారంభించారు. బీసీ కాలనీలో 168 ఇళ్లకు గాను 130 మందికి మాత్రమే కేటాయించారు. వారికి ఇంటి పత్రాలను సైతం అందజేశారు. అప్పటికే చాలా మంది తమకు ఇళ్లు రాలేదని, భూములు, ఇళ్లు ఉన్న వారికే కేటాయించారని ఆందోళన చేపట్టారు. దీంతో రెండో విడతలో కేటాయిస్తామంటూ అధికారులు వారికి నచ్చజెప్పినా వినలేదు. రెండు, మూడు రోజులు దరఖాస్తుదారులు ఆందోళన చేశారు. నేతలు, అధికారుల నుంచి స్పందన లేదు. మరోవైపు ఖాళీగా ఉన్న 38 ఇళ్లను కొందరు ఆక్రమించి అందులో ఉంటున్నారు. పోలీసులు వెళ్లి ఖాళీ



చేయించే ప్రయత్నం చేశారు. దీంతో వారు వాగ్వాదానికి దిగారు. అనర్హులకు ఇచ్చారని, మేము అర్హులమని తెలిపి ఖాళీ చేసేదిలేదని తెలియజేయడంతో వారు వెళ్లిపోయారు. ఎన్నికల సమయం కావడంతో అధికారులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. కొందరు వార్డు సభ్యులు, నాయకులు డబ్బులు తీసుకుని అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపణలు వచ్చాయి. దీంతో స్పందించిన గ్రామ పంచాయతీ సర్పంచి కటకం శ్రీధర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇళ్ల పంపిణీపై విచారణ చేసి ఇచ్చిన వారిలో అనర్హులుంటే తొలగించి అర్హులకు న్యాయం చేయాలని అందులో విజ్ఞప్తి చేశారు. అప్పటికే ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు అటు వైపు వెళ్లలేదు. ఎలాంటి విచారణ జరపలేదు. గ్రామంలో చాలా మంది నిరుపేదలు ఇళ్లు లేక ఏళ్ల తరబడి కిరాయి ఇళ్లలో ఉంటున్నారు. అద్దె కట్టేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నికలు ముగిసినా ప్రభుత్వ ఇళ్లలోకి అక్రమంగా చొరబడిన వారిపై ఇంత వరకు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి విచారణ చేపట్టి నిజమైన అర్హులకు కేటాయించాలని కోరుతున్నారు.

న్యాయం చేయండి

నాకు ఇల్లు లేదు. దాదాపు ఇరవై సంవత్సరాల నుంచి కిరాయికి ఉంటున్నాను. నా భర్త 17 సంవత్సరాల క్రితం మరణించాడు. కూతుళ్లకు పెళ్లి చేశాను. ఒక్క కొడుకు, నేను ఉంటున్నాం. చాలా దీనావస్థలో ఉన్నాం. కిరాయి కట్టడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి. రెండు సార్లు జాబితాలో పేరు వచ్చింది. తుది జాబితాలో నా పేరు తొలగించారు. నాకు న్యాయం చేయాలి.

గోగు పోశవ్వ, గంభీరావుపేట

కలెక్టర్‌కు నివేదించాం

గంభీరావుపేటలోని బీసీ కాలనీలో ఉన్న రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించి 38 ఇళ్లు ఖాళీగా ఉండటంతో దరఖాస్తుదారులు ఎలాంటి అనుమతి లేకుండా వాటిని ఆక్రమించారు. మధ్యలో ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడటం వల్ల పంపిణీలో కొంత వరకు జాప్యం నెలకొంది. కొందరు ఇళ్లను ఆక్రమించిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. త్వరలోనే 38 ఇళ్లను నిజమైన లబ్ధిదారులకు కేటాయించడం జరుగుతుంది.

భూపతి, మండల రెవెన్యూ అధికారి

# భూగర్భ జలం.. సాగుకు బలం

జగిత్యాల : జిల్లాలో ప్రస్తుతం సగటు భూగర్భ జలమట్టం 3.94 మీటర్ల లోతులో ఉండటం యాసంగి పంటల సాగుకు దోహదకారిగా మారింది. సాధారణంకన్నా 27 శాతం అధికవర్షం కురియటం, వానాకాలం ఆయకట్టుకు ఎస్సారెస్పీ నుంచి కాలువనీళు రావటం తదితరాలు భూగర్భ జలమట్టం కనిష్ఠస్థాయిలో కొనసాగడానికి కారణాలుగా ఉన్నట్లు భూగర్భ జలవనరుల శాఖ జిల్లా అధికారి నర్సింహులు పేర్కొన్నారు. రైతులు ఇప్పటికే మక్క, పెసర, మినుము, జొన్న, ఆవాలు, సజ్జ తదితర పంటలను విత్తుకోగా ముమ్మరంగా వరినాట్లు చేపట్టారు. నువ్వులు తదితర ఆరుతడికి ఇంకనూ అవకాశముండటంతో సాగువిస్తీర్ణం 2.81 లక్షల ఎకరాలకు చేరనుంది. శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీటిని ప్రస్తుతం ఆయకట్టుకు వదలగా మార్చి



నెలాఖరు వరకు తడులను విడుదల చేస్తారు కాబట్టి భూగర్భ జలమట్టం స్థిరంగా కొనసాగే అవకాశముంది. కాకతీయ కాలువకు మోటార్లకు అమర్చుకున్న రైతులు పంటలకు నీటిని పారిస్తుండగా ఇతర ప్రాంతాల్లోనూ కాలువనీరు రాని రోజుల్లో రైతులు పంపుసెట్ల ద్వారా పంటలకు నీటిని అందిస్తారు. మొత్తానికి సాగునీటి లభ్యతతో యాసంగికి పూర్తిగా సానుకూల పరిస్థితులు నెలకొనటం రైతులకు సంతోషదాయకంగా మారింది.

# రక్షణ కరవై.. ఆక్రమణలతో కనుమరుగై




హైదరాబాద్ :రాజధాని పరిధిలో ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయి. కొన్ని రికార్డుల్లో కనిపించకుండా పోగా.. మరికొన్నిచోట్ల భారీ నిర్మాణాలు చేపట్టి రూపురేఖలే మార్చేస్తున్నారు. కొందరు అధికారుల చేతివాటం.. స్థానిక నేతల ఒత్తిళ్లతో ఎకరాల కొద్దీ సర్కారు స్థలాలు కనుమరుగవుతున్నాయి. నగర శివారు ఘట్‌కేసర్, జవహర్‌నగర్ పరిధిలో సుమారు రూ. వందకోట్లకు పైగా ప్రభుత్వ స్థలాలను మాయం చేశారు. బాహ్యవలయ రహదారి కోసం హెచ్‌ఎండీఏ ఇరవై ఏళ్ల కిందట సేకరించిన ప్రభుత్వ భూమిలో 3.04 ఎకరాలు కనిపించడం లేదు. రెండు, మూడేళ్లుగా ఈ భూమి ఎక్కడుందోనని అధికారులు వెతుకుతుండటం గమనార్హం.దీని విలువ రూ.90 కోట్ల మేర ఉంటుంది. ఔటర్ నిర్మాణంలో భాగంగా ఘట్‌కేసర్ ప్రధాన రహదారి వద్ద కూడలి కోసం అదే మండలం సర్వే నంబర్ 580లో 5.28 ఎకరాలను పట్టాదారుల నుంచి హెచ్‌ఎండీఏ సేకరించింది. అనంతరం 2.24 ఎకరాల్లో కూడలి నిర్మించారు. మిగిలిన స్థలంలో మొక్కల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కూడలి నిర్మాణం తరువాత సర్వే చేయించకుండా కంచె ఏర్పాటు చేయకుండా మిగతా స్థలాన్ని వదిలేశారు. 2019లో భూముల రికార్డులన్నింటినీ ధరణి పోర్టల్‌లో నమోదు చేశాక సర్వే నంబర్ 580లో నిషేధిత జాబితాలో కేవలం 2.24 ఎకరాలు మాత్రమే ఉంది. మిగిలిన మూడు ఎకరాలు ఎవరి పేర్లతో ఉందో తెలియడం లేదు.

కబ్జాలు.. ఆక్రమణలు..

నర్సరీ వెనుక స్థలం ఖాళీగా ఉండడంతో మేడ్చల్ జిల్లా సమీకృత కార్యాలయాన్ని నిర్మించేందుకు ఇవ్వాలంటూ కోరగా.. హెచ్‌ఎండీఏ తిరస్కరించారు. నాలుగైదేళ్లుగా స్థిరాస్తి వ్యాపారం భారీగా పెరగడంతో కొందరు అక్రమార్కులు నర్సరీ వెనుక స్థలాన్ని చిన్నచిన్నగా అక్రమించుకుంటున్నారు. తాత్కాలిక షెడ్లు, గుడిసెలు వేస్తున్నారు. విషయం అధికారుల దృష్టికి వస్తే అప్పటికప్పుడు తొలగించి చేతులు దులుపుకొంటున్నారు. ఆ స్థలం తమదే అంటూ అధికారికంగా ఈ రోజు వరకు సూచికలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

సర్కారు జాగాలో ఫామ్‌హౌస్.. ఈతకొలను

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, జవహర్‌నగర్: గత ప్రభుత్వంలో పెద్ద హోదాలో ఉన్న నేత జవహర్‌నగర్ పరిధిలోని సర్వేనం. 476, 501ల్లో ఉన్న రూ. 30 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ఆక్రమించుకొని అందులో ఫామ్‌హౌస్, ఈతకొలను నిర్మించారు. గతంలో ఆక్రమణకు ప్రయత్నాలు జరిగితే అప్పటి తహసీల్దార్ గౌతమ్‌కుమార్ వాటిని కూల్చేయించారు. ఆయన బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన అధికారులపై ఓ శాసనసభ్యుడు ఒత్తిడి చేయడంతో ఆ స్థలం వైపు చూడలేదు. దీంతో 2.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏకంగా ఫామ్‌హౌస్, ఈతకొలను భారీ బందోబస్తుతో నిర్మించేశారు. ఆ ఇంటి వైపు రాకుండా ప్రహరీ చుట్టూ విద్యుత్తు కంచెను ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ నుంచి అనుమతులు తీసుకుని పన్నులు చెల్లిస్తున్నారు.మాకు సంబంధం లేదు..: రామలింగం, కమిషనర్, జవహర్‌నగర్‌ఫామ్‌హౌస్‌తో తమకుసంబంధం లేదని, ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని జవహర్‌నగర్ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. స్విమ్మింగ్‌పూల్ నిర్మాణానికి సైతం అనుమతులు ఇవ్వలేదని తెలిసింది. మున్సిపాలిటీ నుంచి ఆ స్థలానికి సంబంధించి ఎలాంటి హక్కులు ఇవ్వలేదు. కేవలం పన్ను రశీదులను మాత్రమే పొందారు.కోర్టుకు వివరాలు ఇచ్చాం: మతీన్, తహసీల్దార్, కాప్రా సదరు ఫామ్‌హౌజ్ నిర్మాణానికి పన్ను చెల్లిస్తున్నామని రశీదులతో కొందరు కోర్టుకెళ్లారు. ఈ వివాదం కోర్టులో ఉండటంతో మేం మా వాదనను కోర్టుకు వివరించాం. న్యాయస్థానం ఉత్తర్వులు ఇవ్వగానే నిర్మాణాలను కూల్చేస్తాం.

# మత్తు ముఠాలకు ముకుతాడు

హైదరాబాద్: మత్తు ముఠాలకు కళ్లెం వేసేందుకు రాజధానిలో కొత్త పోలీసు దళం సిద్ధమవుతోంది. డ్రగ్స్, గంజాయి నియంత్రణకు ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ విభాగాలు, స్థానిక పోలీసులు పని చేస్తున్నారు. ఇక నుంచి మూడు కమిషనరేట్లలో కొత్తగా నార్కోటిక్ కంట్రోల్ సెల్‌లు అందుబాటులోకి రానున్నాయి. కేవలం డ్రగ్స్, గంజాయి ముఠాల్ని అరెస్టు చేసి.. స్వాధీనం చేసుకోవడంతో పాటు సొంతంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేసేలా ఈ విభాగాలకు అధికారాలు కల్పించారు. ఇందులో భాగంగా మూడు కమిషనరేట్లకు కలిపి కొత్తగా మూడు ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. బుధవారం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా రాచకొండ, సైబరాబాద్ నార్కోటిక్ కంట్రోల్ విభాగాలకు డీసీపీలను బాధ్యులుగా నియమించింది.శిక్షలపైనే ప్రధాన దృష్టినగరంలో గత కొన్నేళ్లలో డ్రగ్స్, గంజాయి వినియోగం పెరిగింది. టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ విభాగాలు మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుంటున్నా వీటి అధికారాలు పరిమితమే. నిందితుల్ని అదుపులోకి తీసుకోవడం, సరకును స్థానిక పోలీసులకు అప్పగించడం వరకే వీరి బాధ్యత. దర్యాప్తు, విచారణ బాధ్యత ఆయా ఠాణాల అధికారులే చూసుకుంటున్నారు. ఫలితంగా కేసులు శిక్షల వరకూ వెళ్లలేని పరిస్థితి. నిందితులు జైలు నుంచి బయటకొచ్చి మళ్లీ దందా మొదలుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో పూర్తిగా డ్రగ్స్ నియంత్రణపైనే పనిచేసేందుకు ప్రభుత్వం గతేడాది టీఎస్ న్యాబ్‌ను ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో ఇంకా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు వేగం అందుకోలేదు. తాజాగా ప్రభుత్వం పూర్తి స్పష్టత ఇచ్చిన నేపథ్యంలో మార్పులు చోటు చేసుకొనే అవకాశం ఉంది. రాష్ట్ర స్థాయిలో టీఎస్ న్యాబ్ పనిచేస్తూనే.. నగరంలోని మూడు కమిషనరేట్ల స్థాయిలో ప్రత్యేకంగా నార్కోటిక్ విభాగాలు పనిచేస్తాయి. ఒక్కో కమిషనరేట్‌లో ఒక్కో పోలీస్‌స్టేషన్ ఉంటుంది.

డీఎస్పీలు ఎస్‌హెచ్‌వోలుగా..!

నగరంలోని నార్కోటిక్ విభాగాలకు డీసీపీ స్థాయి అధికారుల్ని బాధ్యులుగా నియమించారు. సైబరాబాద్ డీసీపీగా భాస్కర్ అగ్గడి, రాచకొండ కరుణాకర్‌ను నియమించారు. హైదరాబాద్‌కు ఎవరనే విషయంలో ఇంకా స్పష్టత రాలే. కొత్తగా ఏర్పాటయ్యే పోలీస్‌స్టేషన్లకు డీఎస్పీలను ఎస్‌హెచ్‌వోలుగా నియమించారు. హైదరాబాద్ ఠాణా ఎస్‌హెచ్‌వోగా నర్సింగరావు, రాచకొండకు రమేశ్, సైబరాబాద్‌కు హరిశ్చంద్రారెడ్డి నియమితులయ్యారు. అదనపు సిబ్బంది, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రాగానే పోలీస్‌స్టేషన్ల కార్యకలాపాలు మొదలవనున్నాయి. బేగంపేటలోనే మూడు ఠాణాలు ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిపారు.

# వేతనాలు అందక.. ఇబ్బందులు తప్పక

కరీంనగర్ : విద్యాబోధనతోపాటు విద్యాశాఖ కార్యాలయాలు, క్షేత్ర స్థాయిలో కార్యక్రమాల అమలుకు నిరంతరం కృషి చేస్తున్న సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు రావడం లేదు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోధన, విద్యా కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్షా, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్‌లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు రెండు నెలలుగా నెలవారీ వేతనాలకు దూరంగా ఉంటున్నారు.

555 మంది..జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జిల్లాలో 555 మంది ఒప్పంద ఉద్యోగులు డీఈవో, ఎంఈవో కార్యాలయాలు, కేజీబీవీలు, భవిత కేంద్రాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 12 కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు బాలికల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కేజీబీవీల్లో ప్రత్యేకాధికారులకు రూ.32,500, పీజీ సీఆర్టీలకు రూ.29,900, సీఆర్టీలకు రూ.26,000, నాన్‌టీచింగ్ సిబ్బందికి రూ.9750–14000 వరకు నెల వేతనాలుగా చెల్లిస్తున్నారు. డీఈవో, ఎంఈవో కార్యాలయాల్లో పనిచేస్తున్న సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, మెసేంజర్లు, జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఒప్పంద



పద్ధతిలో పనిచేస్తున్న వీరి నెల వేతనాలు రూ.9,500 నుంచి రూ.25,000 లోపు నిలుస్తున్నాయి. తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వారికి రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

వాటా జమ చేయని రాష్ట్ర ప్రభుత్వం..

సమగ్ర శిక్షాకు నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60–40 శాతం ప్రకారం మంజూరు చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం తమ వాటా నిధులను జమ చేయగా, వాటిని వినియోగించిన రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాను ఇప్పటి వరకు జమ చేయని కారణంగా రెండు నెలలుగా వేతనాల సమస్య నెలకొందని ఉద్యోగుల్లో చర్చ కొనసాగుతోంది. కేజీబీవీల నిర్వహణకూ కొంతకాలంగా సకాలంలో నిధులు రాని కారణంగా సప్లయర్లు వాటి కోసం ఎదురుచూస్తున్నారు.

ఆలస్యం చేయకుండా చెల్లించాలి బోధన, బోధనేతర సిబ్బందికి గత రెండు నెలలుగా వేతనాలు రావడం లేదు. వీటిపైనే ఆధారపడి విధులు నిర్వహిస్తున్న వారు ఆర్థిక ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా నెలనెలా వేతనాలు చెల్లించాలి.డి.శ్రీలత, రాష్ట్ర కేజీబీవీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు

# పనుల్లో జాప్యం.. నగరవాసులకు శాపం

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లలో ముఖ్యమంత్రి హామీ(సీఎంఏ) రూ.132 కోట్లతో చేపట్టే నిధులకు సంబంధించిన అభివృద్ధి పనులు మూడు నెలల కిందట ప్రారంభించారు. ఒక్కో డివిజన్‌లో నాలుగైదు రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగునీటి పైపులైన్లు ఉండటంతో అందులో సగం మేర పూర్తి చేశారు. మిగతావి చేసేందుకు తవ్వి వదిలేయడం, ఆ తర్వాత అధికారులు సైతం ఒత్తిడి పెంచకపోవడంతో నిర్లక్ష్యం మొదలైంది. ఆయా డివిజన్ల కార్పొరేటర్లకు ప్రజలు ఫిర్యాదు చేస్తుండగా గుత్తేదారు ఆ వైపు కన్నెత్తి చూడటంలేదని అంటున్నారు.

నత్తనడకన..నగరంలోని కట్టరాంపూర్, కోతిరాంపూర్, లక్ష్మీనగర్, రేకుర్తి, అశోక్‌నగర్, జ్యోతి రోడ్డు, కమాన్ రోడ్డు, మంకమ్మతోట, భాగ్యనగర్, కిసాన్‌నగర్, తీగలగుట్టపల్లి, విద్యానగర్, కాపువాడ తదితర ప్రాంతాల్లో రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగునీటి పైపులైన్ల పనుల కోసం తవ్వారు. సగం మేర పూర్తి చేయగా మిగతావి చేయకుండా వదిలేశారు. కొన్ని చోట్ల అడ్డంకులు ఉండగా మిగతా ప్రాంతాల్లో నత్తనడకన సాగుతున్నాయి. వంకర టింకరగా మురుగుకాల్వలు నిర్మించినా పరిశీలించడం లేదనే అభిప్రాయముంది.

రాకపోకలకు అవస్థలు

నిత్యం రద్దీగా ఉండే వీధులు, దుకాణాల సముదాయాలు ఉన్న ప్రాంతాల్లో కాల్వలు, రోడ్లు నిర్మించకుండా వదిలేశారు. వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. మురుగు ఇళ్ల ముందు నిలిచి ఉండటంతో వాసన, దోమల బెడద భరించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి పనులు సాగుతుండగా కనీసం అధికారులు చూసీ చూడనట్లుగా ఉంటున్నారు. ఆ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని గందరగోళం నెలకొంది. సంబంధిత ప్రాంతాల ఇంజినీరింగ్ అధికారులు సైతం దాటేసే ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా మేయర్, ఉన్నతాధికారులు స్పందించి పనుల్లో వేగం పెరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం రద్దీగా ఉండే జ్యోతి రోడ్డులో మురుగుకాల్వ నిర్మించేందుకు రెండు నెలల కిందట తవ్వారు.. ఒక వైపు పనులు పూర్తి చేయగా మరో వైపు తవ్వి వదిలేశారు. ఇళ్లల్లోకి, దుకాణాలకు వెళ్లలేని పరిస్థితి ఆ ప్రాంతం వారిది. మురుగు వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు.తిరుమల్‌నగర్‌లో ఆటో స్టాండ్ పక్క నుంచి వీధుల్లో కొత్త రోడ్డు వేసేందుకు కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. రోడ్డు వేయకుండా వదిలేశారు. కంకర మీదుగా రాకపోకలు సాగిస్తుండగా పనులు పూర్తి చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. కట్టరాంపూర్‌లోని గిద్దెపేరుమాండ్ల రహదారి నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా పనులు సాగుతున్నాయి. విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు అడ్డుగా వస్తుండగా అక్కడి మేర వదిలేయడం విమర్శలకు దారి తీస్తోంది.కోతిరాంపూర్ ప్రధాన రహదారి మీదుగా గిద్దెపేరుమాండ్ల గుడి వైపు వెళ్లు దారిలో పనులు తీవ్ర జాప్యమవుతున్నాయి. ఈ వైపు గుండా అంబేడ్కర్ స్టేడియం, భగత్‌నగర్‌కు వెళ్లు ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. పైపులైన్లు పగిలిపోవడం, నెమ్మదిగా కొత్త లైను వేయడంతో రెండు వైపులా ఉన్న వీధి ప్రజలకు నల్లా నీరు నిలిచిపోయింది.అశోక్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల ఎదురుగా నుంచి హౌస్సేనీపురకు వెళ్లు దారిలో రెండు నెలలుగా మురుగుకాల్వ, రోడ్డు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. పనులు చేయకుండా దాటేస్తుండటం, తరచూ పైపులైన్లు పగులకొట్టడంతో ఆ వైపు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

# 'భద్రకాళిపై భూబకాసురుల కన్ను'

రంగంపేట : భూబకాసురుల నుంచి భద్రకాళి చెరువును రక్షించాలని, ఫుల్ ట్యాంకు లెవల్(ఎఫ్‌టీఎల్) నిబంధనలకు విరుద్ధంగా చెరువు స్థలాల్లో మట్టి నింపుతుంటే హనుమకొండ జిల్లా యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహిస్తోందని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. ప్రైవేటు గూండాల పహారాలో 24 గంటలూ మట్టి నింపుతున్నారన్నారు. సోమవారం హనుమకొండ పద్మాక్షిగుట్ట రోడ్డులో ఆక్రమణకు గురవుతున్న భద్రకాళి చెరువు స్థలాలను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. సుమారు 30- 40 ఎకరాల భూమిని సొంతం చేసుకునేందుకు భారాస నాయకులు యత్నిస్తున్నారని, రెండు, మూడు చోట్ల చెరువు కట్టను తెంచేసి మురుగు నీటిని మళ్లిస్తున్నారని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. హనుమకొండ పోచమ్మకుంటలోని హనుమాన్ గుడి స్థలాలు వరంగల్‌లోని వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేశారని విమర్శించారు. పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ నాయకత్వంలో విజయ్‌భాస్కర్, సోదా కిరణ్, రంజిత్‌రెడ్డి విచ్చలవిడిగా కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. వరంగల్ పోలీసు కమిషనర్ వద్ద నమోదవుతున్న ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం భారాస నాయకులవేనని ఆరోపించారు. హనుమకొండ నగరం నడిబొడ్డున చెరువును కొల్లగొడుతుంటే అధికారులు మౌనంగా ఉండటం సరైంది కాదన్నారు. భద్రకాళి చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు



చేస్తామని రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే ఇల్లు ముట్టడిస్తాం

ఈనెల 20 లోగా అర్హులైన వారందరికీ రెండు పడకల ఇళ్లు ఇవ్వకపోతే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఇంటిని ముట్టడిస్తామని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. డీసీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్లవుతున్నా ఇంత వరకు వరంగల్ నగర పరిధిలో ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే అనుచరులు ఇళ్లు ఇప్పిస్తామని పేదల నుంచి డబ్బులు వసూలు చేశారన్నారు. తొమ్మిదేళ్లలో ఏం చేశారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. కాజీపేట బస్టాండ్, కొత్త ఆర్వోబీ ఏమైందని నిలదీశారు. రింగు రోడ్డు, వరంగల్ మాస్టర్ ప్లాన్‌పై ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్, కార్పొరేటర్లు తోట వెంకన్న, శ్రీమాన్, జిల్లా నాయకులు లక్ష్మణ్, సరళాయాదవ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠధామం.. వసతులు శూన్యం

భూపాలపల్లి : ఈ చిత్రంలో కనిపిస్తున్నది మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోని వైకుంఠధామం.. విద్యుత్తు సౌకర్యం ఉన్నా బోరు వేయించలేదు.. దహన సంస్కారాల అనంతరం స్నానాలకు దగ్గరలోని బావులు, కుంటలకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో గాలివానకు వైకుంఠధామం పైకప్పు రేకులు మొత్తం పగిలిపోయాయి. కనీసం నీడ కరవైంది.పల్లెల్లో ఎవరైనా మరణిస్తే.. మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేయడాన్ని పవిత్ర కార్యంగా భావిస్తారు. అలాంటిది దహన సంస్కారాలు సరిగా జరగకపోతే ఆవేదనకు గురవుతారు. ఈ ఇబ్బందులు ఉండొద్దనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను నిర్మించింది. అయితే విద్యుత్తు, నీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు కొరవడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 11 మండలాలు 241 పంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా వైకుంఠ ధామాలను నిర్మించారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా



వ్యవహరిస్తుండటంతో పేరుకే అన్నట్టు ఉన్నాయి. 241 గ్రామాల్లో కేవలం 48 శ్మశాన వాటికలకు మాత్రమే విద్యుత్తు సౌకర్యం ఉంది. 107 వైకుంఠ ధామాలకు మాత్రమే నీటి వసతి ఉంది. మిగిలిన వాటిల్లో విద్యుత్తు, నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఇప్పటికీ శిఖం భూముల్లోనే..

ప్రభుత్వం శ్మశానవాటికలకు ఉపాధి హామీ నిధులు వెచ్చించింది. చాలా చోట్ల బోర్లు, విద్యుత్తు వంటి సౌకర్యాలు లేకపోవడంతో శిఖం భూములు, పంట పొలాలు, కాలువ గట్లపైన మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతో అక్కడి వరకు వెళ్లలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సౌర దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

– ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లా వ్యాప్తంగా నిర్మించిన వైకుంఠ ధామాల్లో ఎక్కడైతే విద్యుత్తు సౌకర్యం లేదో అక్కడ సౌర దీపాలను ఏర్పాటు చేసేలా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రణాళిక తయారు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇటీవల ఒక గుత్తేదారు సంస్థతో మాట్లాడి పనులకు సంబంధించి అంచనా వేశారు. నీటి సౌకర్యం లేని శ్మశాన వాటికల్లో చేతిపంపులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

# అంతరిక్ష పాఠం.. ఇనుమడించు విజ్ఞానం



మణుగూరు : అంతరిక్ష విజ్ఞానంపై మరింత పట్టు సాధించాలనుకునే ఉపాధ్యాయులకు సువర్ణావకాశం. ఇస్రో పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్(ఐఐఆర్ఎఎస్) ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పాఠాలను అందిస్తోంది. ఉపగ్రహ ఛాయా చిత్రాలపై విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా ప్రోత్సహిస్తోంది. ప్రతిఏటా వేసవి సెలవుల్లో ఈ శిక్షణ నిర్వహించగా ఈసారి కొంత ఆలస్యమైంది. ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి(ఇంటర్మీడియట్) వరకు బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు శిక్షణకు అర్హులు. ఐదు రోజుల కోర్సు తర్వాత శిక్షకులు ప్రశ్నపత్రం పూరించి నివేదించాల్సి ఉంటుంది. ప్రతిభ కనబర్చిన వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారు. ఈ శిక్షణతో అంతరిక్ష పాఠాలపై ఉపాధ్యాయులకు మరింత విజ్ఞానం పెరగనుంది.

ప్రతిభకు పట్టా..

ఇస్రో అంతరిక్ష ఆన్‌లైన్ శిక్షణలో కాలానికనుగుణంగా కొత్త అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం, వాటి అనువర్తనాలు అనే అంశంపై తరగతులు నిర్వహించనున్నారు. స్పేస్ క్రాఫ్ట్ సిస్టమ్, ప్లానెటరీ సైన్స్, ఆర్థిక, సామాజిక అభివృద్ధి, వాతావరణ సమాచారం, దూరవిద్య, పర్యావరణ శీతోష్ణస్థితిపై అధ్యయనం, ఆహారం, నీటి భద్రత, ప్రకృతి వైపరీత్యాలు అనే అంశాలపై పట్టు పెంచనున్నారు. 70 శాతం హాజరు, ప్రతిభ చాటిన ఉపాధ్యాయులకు మెయిల్ ద్వారా ధ్రువపత్రాలను ఇస్రో అందజేస్తుంది.

2007లో 300 మందితో..

పాఠశాల స్థాయి విద్యార్థులకు ఉపగ్రహ పాఠాలపై విజ్ఞానం అందించేందుకు ముందుగా ఉపాధ్యాయుల మేథస్సుకు పదును పెట్టాలని నిర్ణయించారు. తొలిసారిగా 2007లో ఈ విధానాన్ని ప్రారంభించారు. గతంలో 300 మంది ఉపాధ్యాయులతో ప్రారంభమైన ఈ శిక్షణకు ప్రతి సంవత్సరం ఆదరణ పెరుగుతుంది. లక్షలాది మంది ఉపాధ్యాయులు శిక్షణ తీసుకుంటూ ధ్రువపత్రాలు అందుకుంటున్నారు.

శిక్షణ విధానం..

ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా, ఆదర్శ, గురుకుల విద్యాలయాల్లోని ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుంచి శిక్షణకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. భౌతిక, రసాయన, జీవశాస్త్ర, గణితశాస్త్ర ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఐఆర్ఎస్.జీవోవీ.ఇన్ అనే లింక్ ద్వారా చరవాణి, జీమెయిల్‌తో పేరు, ఉద్యోగ అర్హతలు, తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. శుక్రవారం వరకు గడువు విధించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ఆధారంగా ఈనెల 19 నుంచి 23 వరకు ఐదు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. అక్షాంశాలు, రేఖాంశాలు, శీతోష్ణ స్థితులు, ఉపగ్రహ ఛాయాచిత్రాలను విశ్లేషించనున్నారు.

ఇస్రో అంతరిక్ష పాఠాలు నేర్చుకునేందుకు సైన్స్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ శిక్షణతో శాస్త్రీయ విజ్ఞానం పెరగనుంది. ఆధునిక, సాంకేతికతను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే విషయాలపై పట్టు పెంచుకోవచ్చు. ఐదు రోజులపాటు శిక్షణ తరగతులకు హాజరు కావాలి. నూతన విషయాలపై అవగాహన పెంచుకునేందుకు ఇది చక్కటి వేదిక. చలపతి రాజు, జిల్లా సైన్స్ అధికారి, భద్రాద్రి

# ప్రణాళిక ముఖ్యం.. పొదుపే మంత్రం



ఖమ్మం : వేసవి కాలంలో ఆటపాటల్లో మునిగితేలిన పిల్లలు ఇక ఉరుకులు పరుగులతో బడిబాట పడుతున్నారు. నాణ్యమైన విద్య ఆశతో తమ పిల్లలను ప్రైవేటు బడుల మెట్లు ఎక్కించడం కోసం తల్లిదండ్రులు ప్రత్యేకించి జూన్‌లో పడే తంటాలు అన్నీఇన్నీ కావు. ప్రతి నెలా ఉండే సాధారణ వ్యయాలతో పాటు ఈనెలలో వారి పిల్లల చదువులకయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుంది. ద్రవ్యోల్బణానికి తగ్గట్టుగా పుస్తకాలు, దుస్తులు, బ్యాగులతో పాటు ప్రైవేట్ పాఠశాలల ఫీజులు ఏటా పెరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై నిపుణుల సూచనలతో ప్రత్యేక కథనం.

అనవసర ఖర్చులు తగ్గించుకోండి

ముందుగా తల్లిదండ్రులు అనవసర ఖర్చులను తగ్గించుకోవాలి. లేదా తరవాత నెలకైనా వాయిదా వేసుకోవాలి. పుట్టినరోజు, పెళ్లిరోజు అంటూ భారీగా ఖర్చు చేయకుండా ఆ డబ్బులను పిల్లల చదువులకు వెచ్చిస్తే పేద, మధ్యతరగతి వారికి ఉపయుక్తంగా ఉంటుంది. వేడుకలను అట్టహాసంగా నిర్వహించినా రోజులు గడిచేకొద్దీ వాటి గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరనే వాస్తవాన్ని గ్రహించాలి. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కంటే తాత్కాలిక సంతోషం కోసం ఎక్కువ ఖర్చు చేయటం ఎట్టిపరిస్థితుల్లోనూ మంచిది కాదని తెలుసుకొని మసలుకోవటం ముఖ్యం.

పిల్లల చదువుల ఖర్చును అధిగమించడానికి చాలామంది అప్పులు చేయాల్సి వస్తోంది. అవకాశాన్ని బట్టి దీర్ఘకాలంలో స్వల్ప మొత్తాల్లో అప్పులను తీర్చుకునే వెసులుబాటును కల్పించుకోవాలి. ఉదాహరణకు స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుబంధ రుణాలు, స్త్రీ నిధి రుణాలు ఇందుకు దోహదపడతాయి.

ఆది నుంచే పిల్లల చదువులు, వారి ఖర్చులపై ప్రణాళిక రచించాలి. అందుకు అనుగుణంగా ప్రతినెలా పొదుపు చేయగలగాలి.

పిల్లల చదువులకు తల్లిదండ్రులు ప్రాధాన్యమివ్వటం మంచి పరిణామం. అయితే అదే సమయంలో ఆదాయ పరిమితిని దృష్టిలో ఉంచుకోవాలి. చదువుల కోసం భారీగా అప్పులు చేయటం తగదు. పాఠశాల సమయం ముగిశాక పిల్లల హోంవర్క్‌పై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. తెలిసిన మేరకు రోజూ కొన్ని విషయాలు చెబుతుంటే విద్యార్థులు చురుగ్గా తయారవుతారు.

ఆర్.రాఘవేంద్ర, ఆర్థికశాస్త్ర నిపుణుడు, మణుగూరు

ఉన్న ఆదాయం సరిపోకపోతే అదనపు రాబడి మార్గాలను అన్వేషించాలి. వేన్నీళ్లకు చన్నీళ్లు తోడు అన్నట్టు కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరూ అవకాశాలను బట్టి ఆదాయం సముపార్జించాలి. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు ఇద్దరూ కష్టపడితేనే పిల్లల చదువులు, ఇతర ఖర్చులను ఎదుర్కోగలం.

కె.రామలింగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రుల అసోసియేషన్ ప్రతినిధి

తల్లిదండ్రులు దుబారా ఖర్చులను తగ్గించుకుంటే మేలు. ఇటీవల కాలంలో అనవసర గొప్పతనాలకు పోతున్నారు. శక్తికి మించి పిల్లల వేడుకలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ఏమేరకు గొప్పతనం వస్తుందో తెలియదు కానీ ఖర్చులు మాత్రం రూ.లక్షల్లో ఉంటున్నాయి. ఒక్కరోజు మురిపెం కోసం పెట్టే ఆ ఖర్చులను పిల్లల చదువులకు వెచ్చిస్తే వారి జీవితాలు మెరుగుపడతాయి. ఎం.రామిరెడ్డి, ఆర్థికశాస్త్ర నిపుణుడు, భద్రాచలం

# ఖమ్మం గుమ్మంలో రాజకీయ వేడి

ఖమ్మం : శాసనసభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్నకొద్దీ రాజకీయ వేడి రాజుకుంటోంది. ప్రధాన పార్టీలు ప్రజాక్షేత్రంలో తలమునకలవుతున్నాయి. ఇందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదికవుతోంది. భాజపా, కాంగ్రెస్ అగ్రనేతలు ఖమ్మం దారి పడుతుండటం, వామపక్ష పార్టీలు సైతం ఇక్కడి నుంచే ఎన్నికల క్షేత్రంలోకి దిగేలా కార్యాచరణ రూపొందించుకోవడంతో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

చంద్రబాబు రాకతో తెలుగు తమ్ముళ్లలో జోష్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు గతేడాది ఆఖరులో ఖమ్మంలో జరిగిన భారీ బహిరంగ సభకు హాజరై పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. రాబోయే ఎన్నికలకు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు జరిగాయి. కేరళ సీఎం పినరయి విజయన్ హాజరై సమరోత్సాహం నూరిపోశారు.

భారాస ఆవిర్భావ సభతో మొదలు..జాతీయ రాజకీయాల్లో సత్తా చాటాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ఆరంభంలోనే తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మారుస్తూ.. ఆవిర్భావ సభను ఖమ్మంలో నిర్వహించారు. ఉద్యమాల గుమ్మం ఖమ్మంలో పురుడు పోసుకున్న భారాస.. జాతీయ రాజకీయాల్లో రాణిస్తుందని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కొత్తగూడెం వేదికగా ప్రజాగర్జన పేరిట ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభతో సీపీఐ.. ఎర్రదండును కదనరంగంలోకి దింపింది.

భాజపా అగ్రనేతల రాక..ఖమ్మంలో జరిగే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభను కమలదళం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పార్టీకి బలం లేదన్న చోటే సత్తా చాటాలనే తలంపుతో ఉంది. సభకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, పొరుగున ఉన్న జిల్లాల నుంచి జనాలను సమీకరించేందుకు ఆపార్టీ నాయకులు వ్యూహాలు పన్నుతున్నారు. జులైలో కొత్తగూడెంలో మరో భారీ బహిరంగ సభ నిర్వహించాలని యోచిస్తున్నారు. ఆ సభకు ప్రధాని మోదీని ఆహ్వానించేందుకు కసరత్తు చేస్తున్నారు. నెల వ్యవధిలోనే ఇద్దరు అగ్రనేతల పర్యటనతో పార్టీ నాయకులు, శ్రేణుల్ని ఎన్నికల క్షేత్రంలోకి దించేలా భాజపా ప్రణాళికలు రచిస్తోంది.

# విద్యార్థులకు రాగిజావ

జగిత్యాల : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాగిజావ అందించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజన మెనూలో వెజిటబుల్ బిర్యానిని చేర్చగా, ఉదయం రాగిజావ అందించేలా చర్యలు చేపట్టింది. చాలామంది పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తుండగా ఉదయం వచ్చే సమయంలో ఖాళీ కడుపుతో వస్తున్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు అల్పాహారం తీసుకోవడంలేదు. ఫలితంగా రక్తహీనత, పోషకాహార లోపంతో కనిపించడంతోపాటు తరగతి గదుల్లో నీరసంగా, అనాసక్తిగా కనిపిస్తున్నారు. ఈ సమస్యను నివారించేందుకు ఉదయం విరామ సమయంలో రాగిజావ అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 20న జరిగే విద్యా దినోత్సవం నుంచే కొత్త కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. దీనికి అనుగుణంగా జిల్లాలోని 753 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 65 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందించేలా కార్యాచరణ రూపొందించారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అమలు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు బెంగళూరు కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్యసాయి అన్నపూర్ణ



ట్రస్టు జగిత్యాల ఆధ్వర్యంలో దాదాపు 320 పాఠశాలల్లో చదివే 32 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నారు. 2015లో జగిత్యాలలోని మోతె గ్రామ శివారులోని నాగేంద్రనగర్ కాలనీలో 50 మంది విద్యార్థులకు పాలు, హార్లిక్స్‌తో కార్యక్రమాన్ని ప్రారంభించగా ప్రస్తుతం గత ఏప్రిల్ వేసవి సెలవుల వరకు దాదాపు 50 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందించేలా చూశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సహకారంతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా పాఠశాల సెలవుల్లో మిగిలిపోయిన రాగి జావ పౌడర్‌ను జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, రజకులు దాదాపు 1670 కుటుంబాలకు కిలో చొప్పున అందించారు. ఇందులో జగిత్యాలలో 350 పారిశుద్ధ్య, 700 రజక, మెట్‌పల్లి, జమ్మికుంటలో 300 కుటుంబాల చొప్పున పారిశుద్ధ్య కుటుంబాలకు అందించారు.

పేద పిల్లలకు ప్రయోజనకరం

గోవర్ధన ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు

ఉదయం పూట ఖాళీ కడుపుతో వచ్చే విద్యార్థులకు రాగిజావ అందించడం మంచి నిర్ణయం. ఇప్పటికే పలు పాఠశాలల్లో అన్నపూర్ణ సత్యసాయి ట్రస్టు ద్వారా రాగిజావ అందిస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని నిర్ణయించడంతోపాటు మధ్యాహ్న భోజన మెనూలోనూ వెజిటబుల్ బిర్యానిని చేర్చారు. దీంతో విద్యార్థులకు పోషకాహారం అంది చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపే అవకాశంతో పాటు విద్యార్థుల సంఖ్య కూడా పెరగనుంది.

జిల్లాలో పంపిణీ చేస్తున్నాం


ఊటూరి శ్రీకాంత్, ట్రస్టు రీజినల్ సమన్వయ కర్త

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఏ విద్యార్థి పోషకాహార లోపంతో బాధపడకూడదని ఇప్పటికే పలు పాఠశాలల్లో రాగిజావ అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 పాఠశాలల్లో 50 వేల మంది విద్యార్థులకు గతేడాది చివరి వరకు అందించేలా చూశాం. వేసవి సెలవుల్లో మిగిలిన రాగిజావ పౌడర్‌ను జిల్లాలోని దాదాపు వెయ్యికి పైగా పారిశుద్ధ్య, రజక కుటుంబాలకు అందించాం. ప్రస్తుతం ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా అందించేలా ట్రస్టు ఆలోచన చేస్తుంది.

# పైపైనే జలం.. సాగుకు బలం

జగిత్యాల : యాసంగి ముగిసి వానాకాలం పైర్లసాగు ముంగిట జిల్లాలోని మండలాల్లో లభ్యతగల భూగర్భ జలాలు అన్నదాతలకు ఆశాజనకంగా మారాయి. 2022 మే నెలాఖరున 5.81 మీటర్ల లోతుతో పోలిస్తే ప్రస్తుతం భూగర్భ జలాలు మరింత పైనే 5.51 మీటర్ల సరాసరి లోతులో ఉండటం పైర్లసాగుకు ఉపకరించనుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని ఆయకట్టుకు ఏప్రిల్ వరకు నీటిని వదలగా వరద కాలువలోకి కూడా పలు దఫాలుగా నీటిని విడుదల చేశారు. దీంతోపాటు కాకతీయ, వరదకాలువలు, ఇతర డిస్ట్రిబ్యూటరీల నుంచి కూడా చెరువులు, కుంటల్లోకి నీటిని విడుదల చేయటంతో వేసవి ముగిసినా చాలా నీటి వనరులు జలంతోనే నిండి ఉన్నాయి. వాగులు, ఒర్రెల్లోనూ నీరు పారుతుండగా భూగర్భ జలమట్టం పైపైనే ఉండి నెలరోజులు ముందుగా పంటలను సాగుచేయాలన్న ప్రభుత్వ సూచనకు దోహదకారిగా మారింది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.726 టీఎంసీల నీరు నిలువుంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఎల్లంపల్లి నుంచి జలాలను ఎత్తిపోసి వరద కాలువలో నిండుగా నిల్వచేసే వీలుండటం, సగటు భూగర్భ జలమట్టం 5.51 మీటర్లుగా ఉండటం వానాకాలం పైర్లసాగుకు కలిసిరానుంది. కాలువలతో పాటుగా బావులు, బోర్లలోనూ సమృద్ధిగా నీరుండగా మోటార్ల ద్వారా నీటిని తోడుకునే వీలుండటంతో వరినార్లకు అవకాశం కలిగింది. ప్రస్తుతం కనిష్ఠ స్థాయిలో భూగర్భ జలాలుండటంతో 1.27 లక్షల పంపుసెట్ల ఆధారితంగా జిల్లాలో పైర్లసాగుకు అవకాశం ఏర్పడిందని భూగర్భ జలవనరులశాఖ జిల్లా అధికారి జి.నర్సింహులు పేర్కొన్నారు.ఈ వానాకాలంలో 4.43 లక్షల ఎకరాల్లో ఆహార, ఉద్యాన పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేయగా ఇందులో అత్యధికంగా 2.98 లక్షల ఎకరాల్లో వరిని పండించనున్నారు. ఇప్పట్నుంచి జులై నెలాఖరు వరకు పెద్దఎత్తున వరినార్లు పోసి సెప్టెంబరు వరకు వరినాట్లు వేస్తారు కాబట్టి వీరికి జల లభ్యత ఎంతో ఉపయుక్తంగా మారనుంది. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలతో ప్రాజెక్టుల నీటి లభ్యత, భూగర్భ జలాల అందుబాటుతో రైతులు వానాకాలం పంటలను సాగు చేసేందుకు సన్నద్ధమవుతుండగా ప్రకృతి కరుణించి సమృద్ధి వర్షాలు కురిసి, ఎల్లంపల్లి నుంచి ఎస్సారెస్పీలోకి ఎత్తిపోతలు సిద్ధిస్తే ఈ సీజన్‌లోనూ రైతులు మెండైన పంటలను సాగుచేయగలుగుతారు.



# సీఎం జగన్‌తో విజయవాడ ఎంపీ కేశినేని నాని భేటీ

తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో విజయవాడ ఎంపీ కేశినేని నాని భేటీ ముగిసింది. బుధవారం మధ్యాహ్నం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. కేశినేని నాని వెంట ఆయన కుమార్తె శ్వేత కూడా ఉన్నారు. కాగా విజయవాడ ఎంపీ అయిన కేశినేని టీడీపీ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. నాని బాటలో ఆయన కూతురు కూడా టీడీపీకి గుడ్‌బై చెప్పారు. విజయవాడ 11వ డివిజన్ కార్పొరేటర్ అయిన ఆమె తన పదవికి రాజీనామా సమర్పించారు.




ఢిల్లీ: 'ఒకే దేశం – ఒకే ఎన్నిక'పై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్రం కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఈ కమిటీ చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే ప్రజల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానించింది. దీనికి విశేష స్పందన లభిస్తోంది. వేలాది మంది ప్రజలు తమ సూచనలను పంపిస్తున్నారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇప్పటివరకు 5వేలకు పైగా ఈ–మెయిళ్లు వచ్చినట్లు పేర్కొన్నాయి. దేశంలో జమిలి ఎన్నికలను నిర్వహించేలా.. ప్రస్తుతం ఉన్న చట్టపరమైన అడ్మినిస్ట్రేటివ్ ఫ్రేమ్‌వర్క్‌లో తగిన మార్పులను సూచించాలని కోవింద్ కమిటీ ఇటీవల ఓ ప్రకటనలో కోరింది. జనవరి 15లోగా ప్రజలు తమ సలహాలు, సూచనలు పంపవచ్చని వెల్లడించింది. ఈ సూచనలను కమిటీ వెబ్‌సైట్ %శీఅశీవ.స్త్రశీజ.ఱఅ%లో పోస్ట్ చేయాలని లేదంటే %ంష-ష్ట్రశ్రీఎఏస్త్రశీజ.ఱఅ% ఐడీకి ఈ–మెయిల్ చేయాలని తెలిపింది. ఒకే దేశం– ఒకే ఎన్నిక కోసం గతేడాది సెప్టెంబరులో ఈ కమిటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి రెండుసార్లు సమావేశాలు నిర్వహించింది. ఇటీవల ఆరు జాతీయ పార్టీలు, 33 ప్రాంతీయ పార్టీల నుంచి అభిప్రాయాలు కోరింది. జమిలి ఎన్నికలపై న్యాయ కమిషన్ నుంచి కూడా సలహాలు తీసుకుంది.




# మూడు కేసుల్లో ముందస్తు బెయిల్

అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబుకు భారీ ఊరట లభించింది. మూడు కేసుల్లో ఒకేసారి ఏపీ హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తును ప్రభావితం చేసేలా వ్యాఖ్యలు చేయొద్దని ఆదేశించారు. వారంలోపు రూ.లక్ష చొప్పున ఇద్దరు పూచీకత్తు ఇవ్వాలని తెలిపారు.

పిటిషనర్లకు 48 గంటల ముందు నోటీసు ఇచ్చాకే విచారించాలని సీఐడీని ఆదేశించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్‌ఆర్), ఇసుక, మద్యం వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయంటూ చంద్రబాబుపై ఏపీ సీఐడీ కేసులు నమోదు చేసింది. వీటిపై ముందస్తు బెయిల్ కోరుతూ ఉన్నత న్యాయస్థానంలో ఆయన 3 వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే వాదనలు ముగిసిన నేపథ్యంలో హైకోర్టు నేడు తన నిర్ణయాన్ని ప్రకటించింది. మద్యం కేసులో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, విశ్రాంత ఐఏఎస్ శ్రీనరేశ్‌కూ ముందస్తు బెయిల్ మంజూరైంది.




విజయవాడ: తక్షణమే మెగా డీఎస్సీ నిర్వహించాలని యువజన సంఘాల నాయకులు, నిరుద్యోగులు పిలుపునిచ్చిన 'చలో సీఎం క్యాంపు కార్యాలయం' ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది.

ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని విజయవాడలోని బందర్ రోడ్డు రాఘవయ్య పార్కు నుంచి తాడేపల్లికి వెళ్లాలని తొలుత వీరు నిర్ణయించుకున్నారు. పోలీసులు ముందే అక్కడ మోహరించి ఉండటంతో.. బెంజిసర్కిల్ నుంచి సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి బయలుదేరి వెళ్లారు. నేతాజీ వంతెన వద్దకు చేరుకోగానే వీరిని అడ్డుకున్నారు.

ఈ క్రమంలో నిరుద్యోగులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ తర్వాత ఆందోళనకారులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి వాహనంలో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు.

# ఇచ్చేదానికంటే జగన్ కొట్టేసేదే ఎక్కువ: తెదేపా నేత విజయ్‌కుమార్



మంగళగిరి: బటన్ నొక్కుడు పేరుతో ప్రజలకు ఇస్తున్నదానికంటే.. మద్యం, ఇతర మార్గాల్లో సీఎం జగన్ కొట్టేస్తున్నదే ఎక్కువని తెదేపా అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ ఆరోపించారు.

మంగళగిరిలోని పార్టీ కార్యాయలంలో ఆయన మాట్లాడారు. దశలవారీగా మద్యాన్ని నిషేధిస్తానన్న జగన్.. తయారీ నుంచి అమ్మకం వరకు దశలవారీగా పేదలసొమ్ము దోచేశారని దుయ్యబట్టారు. మద్యం అమ్మకాల ద్వారా రోజూ రూ.80 కోట్లు లాగేస్తున్నారని విమర్శించారు.




# రెండేళ్ల కనిష్టానికి పడిపోయిన ఉష్ణోగ్రతలు.. ఈ సీజన్‌లోనే..

ఢిల్లీ: ఉత్తర భారతదేశానికి శీతాకాలం చుక్కలు చూపిస్తోంది. తీవ్ర చలితో ఉత్తర భారతదేశం మొత్తం వణికిపోతోంది. దీంతో ఉదయం వేళల్లో ఇళ్ల నుంచి ప్రజలు బయటకి రాలేకపోతున్నారు. చలికి తోడు మంచు కూడా కురుస్తుండడంతో తెల్లవారాక కూడా చీకట్లు కమ్ముంటున్నాయి. దీంతో రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు సమస్యలు తప్పడం లేదు. మంచు కారణంగా రోడ్డు కనిపించక పలు చోట్ల ప్రమాదాలు కూడా జరిగాయి. తీవ్ర చలి, మంచు కారణంగా ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో ఉష్ణోగ్రతలు రెండేళ్ల కనిష్టానికి పడిపోయాయి. దీంతో ఢిల్లీలో ఈ శీతకాలంలో మంగళవారం అత్యంత శీతల రోజుగా నమోదైంది. మంగళవారం ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 13.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సాధారణం కంటే ఆరు డిగ్రీలు తక్కువని భారత వాతావరణ శాఖ తెలిపింది. దేశ రాజధానిలో బుధవారం ఉదయం కనిష్ట ఉష్ణోగ్రత 7.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు పేర్కొంది. గరిష్ట ఉష్ణోగ్రత 16 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు తెలిపింది. దీంతో బుధవారం నాడు ఢిల్లీకి వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఢిల్లీ చుట్టు పక్కల ప్రాంతాల్లో కూడా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఢిల్లీలో గాలి నాణ్యత కూడా దెబ్బతింది. ఉత్తరప్రదేశ్‌లోనూ ఉష్ణోగ్రతలు బాగా క్షీణించాయి. కాన్పూర్, ఆగ్రాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు 1.1 డిగ్రీల సెల్సియస్, 1.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. తీవ్ర చలి వాతావరణం కారణంగా నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడానికి ఢిల్లీలో నైట్ షెల్టర్లు ఏర్పాటుచేశారు. ఈ షెల్టర్లలో ఆశ్రయం పొందుతున్న వారికి దుప్పట్లు, బెడ్‌లు, వేడినీరు, ఆహారం అందిస్తున్నారు. ఈ నెల 14 వరకు పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, జమ్మూ డివిజన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తర రాజస్థాన్‌లలో ఉదయం కొన్ని గంటల పాటు దట్టమైన పొగమంచు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం మధ్యప్రదేశ్, ఒడిషా, తూర్పు, ఈశాన్య భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు ఏర్పడింది. హర్యానా, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 12 వరకు ఉత్తరాఖండ్‌లో పొగమంచు మంచు పరిస్థితులు ఉంటాయని పేర్కొంది. అలాగే రాబోయే 48 గంటల్లో ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు కూడా ఉండవని తెలిపింది. అయితే రానున్న మూడు రోజులు తమిళనాడు, కేరళ, కోస్తా కర్ణాటక, లక్షద్వీప్ దీవుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

# వైసీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే ! - మరోసారి జగన్ మార్క్ ఎంపిక !



అమరావతి : ఏపీలో అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ మరో ఎన్నికలు కూడా ముంచుకొస్తున్నాయి. అయితే ఇవి ప్రత్యక్ష ఎన్నికలు కావు. పరోక్ష ఎన్నికలే. రాజ్యసభకు జరిగే ద్వైవార్షిక ఎన్నికలను ఈ ఏడాది మార్చిలో నిర్వహించాల్సి ఉంది. ఇందులో రాష్ట్రం నుంచి మూడు ఖాళీలు రాబోతున్నాయి. వీటిని భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తుంది. వీటి కోసం ముగ్గురు అభ్యర్థుల్ని వైసీపీ అధినేత జగన్ ఎంపిక చేశారు. ఏపీ నుంచి ఈసారి సిట్టింగ్ రాజ్యసభ సభ్యులైన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (వైసీపీ), కనకమేడల రవీంద్ర కుమార్ (టీడీపీ), సీఎం రమేష్ (బీజేపీ) పదవీకాలం పూర్తి కాబోతోంది. దీంతో వీరి స్థానాల్లో మరో ముగ్గురు ఎంపీల్ని ఎన్నుకోవాల్సి ఉంది.

అయితే నేరుగా ఎమ్మెల్యేల ద్వారానే జరిగే ఎన్నిక కాబట్టి ఈ మూడు స్థానాల్ని వైసీపీ సునాయాసంగా గెల్చుకోవడం ఖాయం. కానీ రాష్ట్రంలో ప్రస్తుతం వైసీపీ ఇన్ ఛార్జ్ ల మార్పు తర్వాత జరుగుతున్న ఎన్నికలు కాబట్టి ఏదైనా జరగవచ్చనే అంచనాలున్నాయి. రీల్స్ చెయ్యకూడదని చెప్పిన భర్తను చంపేసిన భార్య, సోషల్ మీడియాలో రచ్చరచ్చ ! ఏపీలో ఈసారి ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ సీట్ల కోసం వైసీపీ తరఫున ముగ్గురు అభ్యర్థుల్ని సీఎం జగన్ దాదాపుగా ఖరారు చేశారు. వీరిలో వైసీపీ సీనియర్ నేతలు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, జంగాలపల్లి శ్రీనివాసుల్నిఎంపిక చేసినట్లు తెలిసింది. వీరిలో వైవీ సుబ్బారెడ్డి ఓసీ కాగా.. గొల్ల బాబూరావు ఎస్సీ, జంగాలపల్లి శ్రీనివాసులు బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు. దీంతో ఈసారి రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలోనూ జగన్ సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై వైసీపీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# రెండో రోజు సీఈసీ సమావేశం.. ప్రజెంటేషన్ ఇచ్చిన ముకేశ్‌కుమార్ మీనా




విజయవాడ: కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఏపీలో ఓటర్ల జాబితా, ఎన్నికల సంసిద్ధతపై విజయవాడలోని నోవాటెల్‌లో రెండో రోజు సమావేశం కొనసాగుతోంది. సీఈసీ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై ఎన్నికల సంఘం అధికారులు చర్చిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్‌కుమార్ మీనా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులపై ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. డిసెంబరు 9 వరకు వచ్చిన వేర్వేరు దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. డిసెంబరు 9వ తేదీ తర్వాత వచ్చిన 17,976 దరఖాస్తులను కూడా ఒకట్రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. మృతి చెందిన ఓటర్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించామని ముకేశ్ మీనా వివరించారు. అన్ని రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో 14.48 లక్షల ఓటర్ల పేర్లను గుర్తించామని.. అందులో 5.64 లక్షల పేర్లను అనర్హులుగా తేల్చి తొలగించామని చెప్పారు. ఫాం–7లను గంపగుత్తగా దాఖలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాకినాడ, పర్చూరు, గుంటూరు పశ్చిమ వంటి సెగ్మెంట్లల్లో ఫాం–7 దుర్వినియోగంపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఉరవకొండ, ప్రొద్దుటూరు నియోజకవర్గాల ఈఆర్‌వోలు, పర్చూరు ఏఈఆర్‌వో, ఒక సీఐ, ముగ్గురు ఎస్సైలను సస్పెండ్ చేశామని చెప్పారు. 50 మంది బీఎల్‌వోలపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశాలిచ్చామన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు జరుగుతున్న బదిలీలను పర్యవేక్షిస్తున్నట్టు సీఈసీకి వివరించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పోలీసు విభాగం నోడల్ అధికారి, కేంద్ర పోలీసు బలగాల నోడల్ అధికారులు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ అమలు సమయం నుంచి ఎన్నికల నిర్వహణ వరకూ తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సీఈసీ అధికారులకు పలు సూచనలు చేశారు.

# కొడాలినాని పిచ్చికుక్క.. గుడివాడకు రేబీస్ ఇంజెక్షన్లు.. బుద్దా వెంకన్న సెటైర్

విజయవాడ : మాజీ మంత్రి కొడాని నానిపై టీడీపీ ఉత్తరాంధ్ర ఇంచార్జ్ బుద్దా వెంకన్న ఫైర్ అయ్యారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కొడాలి నాని గుడివాడ పిచ్చికుక్క అంటూ వ్యాఖ్యలు చేశారు. కొడాలి నానికి రేబీస్ ఇంజెక్షన్లు చేయించాలని చాలా సార్లు చెప్పానన్నారు. జనవరి 18న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా చంద్రబాబు గుడివాడలో సభ పెడుతున్నారని తెలిపారు. దీంతో ఊరంతా తిరుగుతానని కొడాలి నాని అంటున్నారని.. ఏం చేస్తాడో అని ఇంజెక్షన్లు కొన్నట్లు ఎద్దేవా చేశారు. తన సొంత డబ్బులతో 5 రేబీస్ ఇంజెక్షన్లు కొని గుడివాడ పార్శిల్ చేస్తున్నట్లు తెలిపారు. జనాల సేఫ్టీ కోసం ఇంజెక్షన్లు కొన్నట్లు చెప్పారు. చంద్రబాబును తిడితే కొడాలి నాని రెండు కాళ్ళూ విరగొట్టి పొయ్యిలో పెడతానని హెచ్చరించారు. కొడాలి నానికి ఇంజెక్షన్లు చేయించాలని గుడివాడ ప్రజలకు టీడీపీ నేత విజ్ఞప్తి చేశారు.

**అదంతా అభూతకల్పనే...** మరోవైపు కేశినేని నాని ఆఫీసు బోర్డులపై బుద్దా వెంకన్న మాట్లాడుతూ.. కనకదుర్గమ్మ ఫ్లైఓవర్ పేటెంట్ రైట్స్ తనవి, చంద్రబాబువి అని తెలిపారు. కనకదుర్గ ఫ్లైఓవర్ తామే పెట్టామని బోర్డులు పెట్టుకుంటే... అదంతా అభూతకల్పన అని చెప్పుకొచ్చారు. మరో నలుగురైదుగురికి రేబీస్ ఇంజెక్షన్లు పంపాలన్నారు. డబ్బులు టైట్‌గా ఉన్నాయని... చూసుకుని పంపిస్తా అంటూ సెటైరికల్ కామెంట్స్ చేశారు. ఉషశ్రీ, శంకరనాయక్, కాపు రామచంద్రారెడ్డి, పార్థసారథి లాంటి బలహీన వర్గాలనే టార్గెట్ చేస్తున్నారన్నారు. బలహీన వర్గాలు చంద్రబాబుకు కొమ్ము కాస్తున్నారని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. బీసీ బస్సు యాత్రలో మొత్తం రెడ్లే ఉన్నారన్నారు. "%× ఖఎ దీజ%... చంద్రబాబుకు బీసీలు కమిట్మెంట్‌గా ఉంటారు" అని బుద్దా వెంకన్న పేర్కొన్నారు.

## ఇదే జరిగితే మీనాక్షికి తిరుగుండదు

మీనాక్షి చౌదరి.. డాక్టర్ అయిన ఈ అమ్మడు తొలిసారి ఇచ్చట వాహనములు నిలుపరాదు అంటూ సినీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ తర్వాత రవితేజ సరసన ఖిలాడి చిత్రంలో నటించింది. అయినా ఈ భామకు సరైనా హిట్ పడలేదు. అడవి శేష్ సూపర్ హిట్ మూవీ హిట్-2లో నటించినా.. అనుకున్నంత స్థాయిలో అవకాశాలు దక్కించుకోలేకపోయంది. అందం, టాలెంట్ ఉన్నా టాలీవుడ్ లో ఛాన్సులు అందుకోలేకపోయింది. కానీ అనూహ్యంగా సూపర్ స్టార్ మహేశ్ బాబు సరసన గుంటూరు కారం మూవీలో నటించే సూపర్ ఛాన్స్ కొట్టేసింది. ఈ సినిమాలో మొదట హీరోయిన్ గా పూజా హెగ్డేను అనుకున్న సంగతి తెలిసిందే. ఆమె తప్పుకోవడంతో మీనాక్షి చౌదరిని తీసుకున్నారు. దీంతో ఆమె స్టార్ హీరోయిన్ క్రేజ్ కొట్టేసింది. ఇటీవల గుంటూరు కారం నుంచి మీనాక్షి చౌదరి లుక్



కూడా బయటకు వచ్చింది. అందులో పల్లెటూరి అమ్మాయిలా లంగావోణీ వేసుకుని చాలా అందంగా కనిపించింది. ఈ సినిమాలో ఆమె మహేశ్ బాబుకు మరదలుగా నటించిందని సమాచారం. ఈ మూవీలో శ్రీలీల మెయిన్ హీరోయిన్ అయినప్పటికీ ఈమె పాత్రకు ఫుల్ స్కోప్ ఉందట. దీంతో ఈ సినిమాపై మీనాక్షి చాలా హోప్స్ పెట్టుకుందట. ఇప్పటి వరకు పెద్ద సక్సెస్ అందుకోపోయిన ఈ బ్యూటీ.. వరుస అవకాశాలతో బిజీగా మారాలని చూస్తోందట. మొన్నటి వరకు కూడా మీనాక్షి చౌదరి పేరు జనాలకు పెద్దగా తెలియకపోయినా.. ఒక్క మహేశ్ మూవీతో ఫుల్ ఫేమస్ అయిందని నెటిజన్లు అంటున్నారు. మహేశ్ సరసన నటించాక ఫేట్ మారిపోనుందని, ఈ సినిమా ఆమె కెరీర్ దశను మార్చేస్తుందని చెబుతున్నారు. మరోవైపు, ఈ బ్యూటీ.. టాలీవుడ్ లో జాక్ పాట్ ఆఫర్ అందుకుందనే వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

రామ్ చరణ్ - బుచ్చిబాబు కాంబోలో తెరకెక్కనున్న ఆర్ సీ 16 సినిమాలోను సెకండ్ హీరోయిన్ గా ఈ భామ సెలెక్ట్ అయిందట. దీంతో మీనాక్షి చౌదరి బంపర్ ఆఫర్ కొట్టిందని నెటిజన్లు అంటున్నారు. ప్రస్తుతం మీనాక్షి కోలీవుడ్ లో మూడు సినిమాలు చేస్తుండగా... టాలీవుడ్ లో రెండు సినిమాలకు కమిట్ అయినట్లు తెలుస్తోంది. గుంటూరు కారం రిలీజ్ కాకముందే ఈ భామ ఇన్ని ఆఫర్లు కొట్టేయడంతో ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది. ఇదంతా మహేశ్ బాబు క్రేజ్ అంటున్నారు. చూడాలి మరి ఏం జరగనుందో.

## థగ్ లైఫ్ ముందుగానే వెళ్తుందా?

విశ్వనటుడు కమల్ హాసన్ -మణిరత్నం కాంబినేషన్ లో 'థగ్ లైఫ్' అనే చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే సినిమాపై అంచనాలు పీక్స్ కి చేరాయి. డిఫరెంట్ గెటప్ లో కమల్ లుక్ ఆద్యంతం ఆకట్టుకుంది. మూడు దశాబ్దాల తర్వాత ఇద్దరు కలిసి పనిచయడంతో? ఇద్దరు భారీ ప్రయోగానికే పూనుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక ఈ చిత్రాన్ని ఏప్రిల్ లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించా లని ప్లాన్ చేసుకున్న సంగతి తెలిసిందే. దానికి సంబంధించి అధికారిక ప్రకటన కూడా ఇచ్చారు. కానీ చిత్రీకరణ ఫిబ్రవరి నుంచే మొదలు పెట్టా లని మేకర్స్ భావిస్తున్నారుట. ఏప్రిల్ అంటే సమ్మర్ సీజన్ కావడంతో పాటు కమల్ హాసన్ డేట్లు కూడా



మరో సినిమాతో క్లాష్ అవ్వడంతో ముందుకు తీసుకొస్తున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. విక్రమ్ హిట్ తర్వాత కమల్ హాసన్ కొత్త ప్రాజెక్ట్ ల జోరు పెంచిన సంగతి తెలిసిందే. హీరోగా నటిస్తూనే లోకనాయకుడు విలన పాత్రలకు సైతం సై అంటున్నారు. ఇప్పటికే పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898' లో విలన్ పాత్రకి ఒకే చెప్పిన సంగతి తెలిసిందే. అలాగే కమల్ సొంత బ్యానర్ లోనూ వరుసగా సినిమాలు నిర్మిస్తున్నారు. దీంతో కమల్ షెడ్యూల్ మునుపటికన్నా బాగా బిజీ అయింది. అలాగే సౌత్ లో ఇతర స్టార్ హీరోలతోనూ పనిచేయడానికి కమల్ ఆసక్తిగా ఉన్నట్లు చాలా కాలంగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త ఏడాదిలో వాటిపైనా సీరియస్ గా రంగంలోకి దిగే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే 'థగ్ లైఫ్' షూటింగ్ ని ముందుగానే ప్రారంభిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈసినిమా కోసం కమల్ ఎక్కువగానే డేట్లు కేటాయించినట్లు చెబుతున్నారు.

కమల్ పాత్ర లో యాక్షన్ పీక్స్ లో డిజైన్ చేయడంతో అందుకోసం అవసరం మేర విదేశాల్లోనూ భారీ షెడ్యూల్స్ ఉన్నాయట. తొలి షెడ్యూల్ చెన్నైలో మొదలు పెట్టి..చివరిగా విదేశాల్లో షూటింగ్ ముగించాలన్నది మణిరత్నం ప్లాన్ గా తెరపైకి వస్తోంది. మరి ఇందులో వాస్తవం ఏంటో తెలియాలి.




## కార్పొరేట్ బుకింగ్స్.. పుష్ప-2, దేవర కూడానా?






గత కొద్ది రోజులుగా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో కార్పొరేట్ బుకింగ్స్ మీద రకరకాల అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రీసెంట్ గా విడుదలై బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టించిన సలార్ విషయంలోనూ ఈ వ్యవహారం తెర మీదకు వచ్చింది. సలార్ మూవీ భారీ స్థాయిలో కార్పొరేట్ బుకింగ్స్ జరుపుకున్నట్లు విమర్శలు రావడం తీవ్ర చర్చకు కారణమైంది. అయితే కొన్నేళ్లుగా బాలీవుడ్ లో కార్పొరేట్ బుకింగ్స్ కల్చర్ కొనసాగుతోంది. అక్కడ తెరకెక్కిన అన్ని సినిమాలకు కార్పొరేట్ బుకింగ్స్ కామనే. కానీ దక్షిణాదిలో ఈ ఇప్పటి వరకు ఏ సినిమాకు కార్పొరేట్ బుకింగ్స్ జరగలేదని చెప్పొచ్చు. టాలీవుడ్ లో సినిమా రిజల్ట్ ఎలా ఉన్నా ఓపెనింగ్స్ అదిరిపోతాయి. థియేటర్లలో హౌస్ ఫుల్ బోర్డులు కనిపిస్తాయి. ప్రస్తుతం టాలీవుడ్ మేకర్స్ దాదాపు అందరూ పాన్ ఇండియా స్థాయిలోనే సినిమాలు రూపొందిస్తున్నారు. దీంతో తమ సినిమాల హిందీ వెర్షన్ కోసం కార్పొరేట్ బుకింగ్స్ ప్లాన్ ను అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చి పుష్ప-1 సినిమా సమయంలో కార్పొరేట్ బుకింగ్స్ జరిగినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. హిందీ వెర్షన్ ద్వారా రూ.100 కోట్లు సాధించడానికి పుష్ప మేకర్స్ భారీగా కార్పొరేట్ బుకింగ్స్ చేశారని ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత ప్రభాస్ ఆదిపురుష్ మూవీ రిలీజ్ టైమ్ లో కూడా మొదటి మూడు రోజులు.. మేకర్స్ కార్పొరేట్ బుకింగ్స్ జరిపినట్లు తెలిసింది. అయితే ఆదిపురుష్ స్ట్రెయిట్ బాలీవుడ్ సినిమా కాబట్టి మేకర్స్ కోసం ఇలాంటివి చేయడం మామూలే. ఇటీవలే రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ అయినా సలార్ మూవీ సుమారు రూ.50 కోట్లకు పైగా కార్పొరేట్ బుకింగ్స్ జరుపుకున్నట్లు విమర్శలు వచ్చాయి. వీటన్నింటిని చూస్తుంటే.. టాలీవుడ్ మేకర్స్ తమ పాన్ ఇండియా చిత్రాల కోసం కచ్చితంగా కార్పొరేట్ బుకింగ్స్ జరుపుతున్నారని వార్తలు వస్తున్నాయి. అలా ఈ ట్రెండ్ కామన్ అయిపోతుందని సినీ పండితులు అంటున్నారు. కార్పొరేట్ బుకింగ్స్ వల్ల ప్రేక్షకులు వెంటనే సినిమా టికెట్స్ బుక్ చేసే అవకాశం ఉందని భావిస్తూ ఈ ట్రెండ్ ఫాలో అవ్వనున్నారట. ఈ నేపథ్యంలో పుష్ప-1 సీక్వెల్ పుష్ప-2 తోపాటు జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న దేవర మేకర్స్ కూడా ఈ ట్రెండ్ కొనసాగిస్తారని సమాచారం. మరి ఇందులో నిజమెంతో తెలియాల్సి ఉంది.

**ఇంతకీ కార్పొరేట్ బుకింగ్స్ అంటే ఏంటి? :** స్టార్ హీరోల సినిమాలు విడుదలయ్యాక, అనుకున్న స్థాయిలో కలెక్షన్స్ రాకపోతే ఆ సినిమాలో నటించిన హీరో, లేదంటే సదరు నిర్మాణ సంస్థ కొన్ని కార్పొరేట్ సంస్థల ఉద్యోగులకు ఆన్ లైన్ లో టికెట్లు బుక్ చేసి, సినిమా చూసే అవకాశం కల్పిస్తాయి. తమ సినిమాకు ఎక్కువ టికెట్లు అమ్ముడు అవుతున్నాయని ప్రకటిస్తాయి. ఫ్రీ టికెట్ తో సినిమా చూసిన వాళు సోషల్ మీడియా వేదికగా సదరు సినిమా గురించి పాజిటివ్ రివ్యూలు ఇస్తారు. అంటే కార్పొరేట్ బుకింగ్స్ చేసి వాళ్ల సినిమాను వాళ్లే ప్రమోట్ చేసుకుంటారు. ఇంకా చెప్పాలంటే ఇదో ఫేక్ కలెక్షన్ స్కామ్ అనవచ్చు.

## సంక్రాంతి సినిమాల సందెట్లో సడేమియా..!










ఎప్పుడూ లేని విధంగా 2024 సంక్రాంతికి తీవ్రమైన పోటీ తెలుగు బాక్సాఫీస్ వద్ద ఉండబోతుంది. మొత్తం అయిదు సినిమాలు సంక్రాంతికి రావాలని భావించాయి. అయితే అందులో రవితేజ నటించిన ఈగల్ సినిమా విడుదల వాయిదా వేసుకోవడంతో కాస్త బాక్సాఫీస్ వద్ద ఒత్తిడి కాస్త తగ్గినట్లు అయింది. ఒక వైపు తెలుగు సినిమాల నిర్మాతలు, హీరోలు థియేటర్ల కోసం కొట్టుకుంటూ ఉంటే మరో వైపు తమిళ హీరోలు మాకు కొన్ని థియేటర్లు కావాలి అంటూ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉంది.

ఈ సమయంలో తమిళ హీరోల డబ్బింగ్ సినిమాలకు థియేటర్లు సాధ్యం కాదని బయ్యర్లు తేల్చేస్తున్నారు. ఈ సంక్రాంతికి తెలుగు బాక్సాఫీస్ వద్దకు గుంటూరు కారం, నా సామి రంగ, సైంధవ్, హనుమాన్ సినిమాలు రాబోతున్న విషయం తెల్సిందే. ఇక అదే సమయంలో పొంగల్ సందర్భంగా తమిళ బాక్సాఫీస్ వద్దకు ధనుష్ నటించిన కెప్టెన్ మిల్లర్ సినిమా రాబోతుంది. అంతే కాకుండా శివ కార్తికేయన్ నటించిన అయలన్ సినిమా కూడా విడుదల అవ్వబోతుంది. ఈ మధ్య కాలంలో తెలుగు లో ఈ ఇద్దరి హీరోలకు మంచి మార్కెట్ క్రియేట్ అయింది. గత చిత్రాలు తెలుగు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు చేశాయి. అందుకే తెలుగు లో వీరి సినిమాలను సాధ్యం అయినంత వరకు విడుదల చేయాలని ఆయా సినిమాల నిర్మాతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ నాలుగు అయిదు రోజులు తమ సినిమాలకే థియేటర్లు కష్టం అనుకుంటూ ఉంటే, మీ సినిమాలకు ఎలా థియేటర్లు ఇవ్వగలం అంటూ ఆ తమిళ సినిమాల నిర్మాతలకు బయ్యర్లు మొండి చేయి చూపిస్తున్నారు. మల్టీ ప్లెక్స్ ల్లో అయినా ఖాళీ ఉంటుందా అంటూ ఆయా తమిళ తంబీలు సందెట్లో సడేమియా అన్నట్లుగా చర్చలు జరుపుతున్నారట. మరి వారికి ఛాన్స్ దక్కేనా లేదంటే వారం ఆగాల్సిందేనా అనేది చూడాలి.

## ఆ రెండిటి తర్వాత శ్రీలీల భవిష్యత్తు ఏంటో..?

శ్రీకాంత్ తనయుడు రోషన్ మేక లీడ్ రోల్ లో వచ్చిన పెళ్లిసందడి సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన శ్రీ లీల అంతకుముందు కన్నడలో చేసిన ఒకటి రెండు సినిమాలకే సూపర్ క్రేజ్ సంపాదించింది. ఇక తెలుగులో ఎంట్రీ ఇవ్వడమే రాఘవేంద్ర రావు చేతుల్లో పడ్డ అమ్మడు ఆ వెంటనే మాస్ మహారాజ్ రవితేజ తో ధమాకా సినిమా చేసింది. ఆ సినిమాతో అమ్మడు బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ధమాకా హిట్ లో శ్రీలీల కూడా మేజర్ రోల్ పోషించిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఆ తర్వాత శ్రీ లీల వరుస సినిమాలు చేస్తూ వస్తుంది. రాం తో చేసిన స్కంద ఫ్లాప్ అవగా బాలకృష్ణ తో చేసిన భగవంత్ కేసరి సినిమా హిట్ అయ్యింది. మళ్లీ వైష్ణవ్ తేజ్ తో చేసిన ఆదికేశవ, నితిన్ తో కలిసి నటించిన ఎక్స్ ట్రాడినరీ మ్యాన్ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. ప్రస్తుతం శ్రీ లీల



ఆశలన్నీ కూడా మహేష్ గుంటూరు కారం మీదే ఉన్నాయి. త్రివిక్రం డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాలో మొదట శ్రీలీల సెకండ్ హీరోయిన్ గా అనుకున్నా పూజా హెగ్దే ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ అవడం తో శ్రీ లీల మెయిన్ హీరోయిన్ గా ఛాన్స్ అందుకుంది. మహేష్ గుంటూరు కారం సినిమాతో ఎలాగైనా హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తుంది శ్రీ లీల. ఈ సినిమా ప్రచార చిత్రాలు కూడా భారీ హైప్ తీసుకొచ్చాయి. సంక్రాంతి బాక్సాఫీస్ మొనగాడుగా మహేష్ నిలబడతాడని చెప్పుకుంటున్నారు. అలా అయితే శ్రీ లీల ఖాతాలో మరో హిట్ పడినట్టే లెక్క. ఇక ఈ సినిమా తర్వాత పవర్ స్టార్ తో చేస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా కూడా లైన్ లో ఉంది. ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకు చాలా టైం ఉంది. అయితే ఈమధ్యలో శ్రీ లీలకు మరో అవకాశం రాలేదు. ధమాకా తర్వాత వరుసగా ఎనిమిది అవకాశాలు అందుకున్న అమ్మడు వాటిలో ఇప్పటివరకు రిలీజైన ఐదు సినిమాల్లో భగవంత్ కేసరి తప్ప అన్నీ ఫ్లాపులే ఫేస్ చేసింది. గుంటూరు కారం హిట్ పడినా ఉస్తాద్ భగత్ సింగ్ కూడా హిట్ పడితేనే శ్రీ లీల కెరీర్ మళ్లీ నిలబడుతుంది. ఈ రెండు సినిమాల తర్వాత శ్రీ లీల మరో సినిమా సైన్ చేయలేదు. విజయ్ దేవరకొండతో సినిమా చేయాల్సి ఉన్నా అది కాస్త మిస్ అయ్యింది. శ్రీ లీల భవిష్యత్తు డిసైడ్ చేయనున్న ఈ రెండు సినిమాలు ఆమెను తిరిగి ఫాం లోకి తెస్తాయా లేదా అన్నది చూడాలి.

## పాన్ ఇండియాలో శీలగా సన్నిలియోన్!

బాలీవుడ్ నటి సన్నిలియోన్ ఇప్పుడు సౌత్ సినిమాల్లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ మినహా యిస్తే అమ్మడికి దక్షిణాదిన ఇతర భాషల్లో బాగానే అవకాశాలు అందుకుంటుంది. సినిమాలతో పాటు వెబ్ సిరీస్ ఛాన్సులు ఒడిసి పట్టుకుంటుంది. వెబ్ సిరీస్ ల రూపంలో సన్నిలియోన్ వరల్డ్ మార్కెట్ ని ఎన్ క్యాష్ చేసుకునే ప్రయత్నాలు జోరుగా కనిపిస్తున్నాయి. తాజాగా సన్నిలియోన్ పాన్ ఇండియా సుందరిగా అభిమానుల్ని అలరించడానికి రెడీ అవుతోంది. శీల అనే పాత్రతో సన్నిలియోన్ లియోన్ మెయిన్ లో మలయాళంలో ఓ వెబ్ సిరీస్ తెరకెక్కిస్తున్నారు. దీనికి సతీష్ అనే కొత్త కుర్రాడు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు



సైతం ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సన్నిలియోన్ సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. ఉత్కంఠభరతమైన ప్రయాణాన్ని చూడటానికి మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి. సన్నీ చేసే మ్యాజిక్ అనుభూతి పొందడానికి సిద్ధంగా ఉండండి. ఇది మీ అందరికీ కచ్చితంగా నచ్చుతుం ది.

నా పాత్ర ఎంతగా ఆకట్టుకుంటుందో మాటల్లో చెప్పలేను. అది ఎలా ఉంది? అన్నది చూసిన తర్వాత మీరే చెప్పాలి అంటూ రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ గా మారింది. సన్నిలియన్ శీల పాత్రలో చూడాటానికి అభిమానులు అంతే ఉత్సాహంతో ఎదురు చూస్తున్నట్లు కామెంట్లు షురూ అయ్యాయి. మరి సన్నలియోన్ తో దర్శకుడు ఎలాంటి సాహసాలు చేయించాడు? సన్నికి అనుభవం ఉన్న పాత్రలో నటించిందా? కొత్త పాత్రలో ఆవిష్కరించాడా? అన్నది చూడాలి. కొన్ని రోజులుగా షూటింగ్ బిజీలో నే ఉండటంతో సన్నిలియోన్ సోషల్ మీడియా యాక్టివిటీ కూడా తగ్గించినట్లు కనిపిస్తుంది. అమ్మడి ఖాతాలో కొత్త అప్ డేట్లు ఏవీ పెద్దగా కనిపించడం లేదని అభిమానులంటున్నారు.




నాంపల్లి (హైదరాబాద్): చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై నుంచి వస్తున్న రైలు ఐదో నంబర్ ప్లాట్‌ఫాంపై నేరుగా వెళ్లి డెడ్ ఎండ్ గోడను ఢీకొట్టింది.

దీంతో మూడు బోగీలు పట్టాలు తప్పాయి. అప్పటికే రైలు దిగేందుకు సిద్ధంగా ఉన్న పలువురు ప్రయాణికులు ఆ కుదుపుతో కిందపడ్డారు. వీరిలో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ 2, ఎస్ 3, ఎస్ 6 బోగీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

స్టేషన్‌లో ఆగేందుకు రైలు నెమ్మదిగా రావడంతో పెను ప్రమాదం తప్పింది. లోకో పైలట్ తప్పిదంతోనే ఈ ఘటన జరిగినట్లు అనుమానిస్తున్నారు. గాయపడిన ప్రయాణిలను చికిత్స నిమిత్తం లాలాగూడలోని ఆసుపత్రికి తరలించారు.

**గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి పొన్నం ఆదేశం :** నాంపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగిన ప్రమాదంపై హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు. పెను ప్రమాదం తప్పిందని.. అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. గాయపడిన వారికి సరైన వైద్యం అందించాలని సూచించారు.




## ఈజ్‌మైట్రిప్ సంస్థకు మాల్దీవుల సంఘం అభ్యర్థన

లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీనిపై భారతీయుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో దేశీయ ప్రయాణ సంస్థ ఈజ్‌మైట్రిప్.. మాల్దీవులకు విమానాల బుకింగ్‌లను నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనిపై అక్కడి టూర్ అండ్ ట్రావెల్ ఆపరేటర్ల సంఘం స్పందించింది. తమ నేతలు కొందరు చేసిన విచారకరమైన వ్యాఖ్యలను పట్టించుకోవద్దని ఈజ్‌మైట్రిప్‌ను కోరింది. ఆ మాటలు మాల్దీవుల ప్రజల అభిప్రాయం కాదని వెల్లడించింది. ఈజ్‌మైట్రిప్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, తమ దేశానికి విమాన బుకింగ్‌లను తెరవాలని మటాటో లేఖ రాసింది. రెండు దేశాల మధ్య రాజకీయాలకు అతీతమైన అనుబంధం ఉందని, భారతీయులను సొంతవారిగా భావిస్తామని వెల్లడించింది. తమ పర్యాటక రంగంలో భారతీయులు అత్యంత కీలకమని తెలిపింది. ఈ నేతల వ్యాఖ్యలను ఆ దేశ పర్యాటక పరిశ్రమ సంఘం (మాటీ) ఖండించిన సంగతి తెలిసిందే. 'భారత్ మాకు స్థిరమైన, కీలక పర్యాటక వనరు. కొవిడ్ తర్వాత మేం కోలుకోవడానికి ఆ దేశం ఎంతో సాయం చేసింది. అంతేకాదు.. మా దేశానికి అతి సన్నిహితమైన దేశం భారత్. ప్రతి సంక్షోభంలోనూ ఆ దేశమే తొలిసారిగా స్పందిస్తుంది. అందుకు మేం ఆ దేశానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం' అని ఒక ప్రకటన విడుదల చేసింది.

**త్వరలో భారత్‌కు ముయిజ్జు :** ఈ పరిణామాల మధ్య మాల్దీవుల ప్రభుత్వం భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే ఆ దేశాధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు త్వరలోనే భారత పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. అయితే తాజా విభేదాలతో దీనికి ఎలాంటి సంబంధం లేదని, అంతకంటే ముందుగానే ఈ పర్యటన ఖరారైనట్లు సమాచారం.




కరీబియన్ దేశం క్యూబా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ద్రవ్యలోటును తగ్గించుకునేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే పెట్రోల్ ధరలను 500 శాతానికి పైగా పెంచుతున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించడంతో దేశ ప్రజలు షాక్‌కు గురయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానున్నట్లు క్యూబా సర్కారు వెల్లడించింది. ప్రస్తుతం అక్కడ లీటర్ పెట్రోల్ ధర 25 క్యూబన్ పెసోలు (కరెన్సీ పేరు)గా ఉండగా.. తాజా నిర్ణయంతో అది 132 పెసోలకు (అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.450కు పైమాటే) చేరనుంది. ఇక, ప్రీమియం పెట్రోల్ ధర 30 పెసోల నుంచి 156 పెసోలకు పెరగనుంది. దీనిపై క్యూబా ఆర్థిక మంత్రి రెగ్యురో మాట్లాడుతూ.. "రానున్న రోజుల్లో డీజిల్, ఇతర ఇంధన ధరలు కూడా పెరగనున్నాయి. నివాస సముదాయాలకు విద్యుత్ ఛార్జీలను కూడా 25 శాతం పెంచుతున్నాం" అని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి చమురు కొనుగోలు చేసేందుకు విదేశీ కరెన్సీని పెంచుకోవాలని యోచిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం, కొన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనాన్ని అమెరికా డాలర్లతో మాత్రమే ప్రజలు కొనుగోలు చేసేలా నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. క్యూబాలో గతంలో ఇంధనాన్ని సబ్సిడీ ధరలకు విక్రయించేవారు. కరోనా మహమ్మారితో అక్కడి ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఇటీవలి కాలంలో ఈ దేశంపై అమెరికా ఆంక్షలను కఠినతరం చేసింది. ఫలితంగా సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



## వాహనదారులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్..

హైదరాబాద్, జనవరి 10: వాహనదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ట్రాఫిక్ చలాన్స్ చెల్లింపునకు గడువును పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 31వ తేదీ వరకు డిస్కౌంట్ చలాన్ కట్టేందుకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం. వాస్తవానికి పెండింగ్ చలాన్లను క్లియర్ చేసేందుకు డిసెంబర్ 26వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది ప్రభుత్వం. నేటితో ఆ గడువు ముగియగా.. ఈ రోజు వరకు రూ. 107 కోట్ల చలాన్ల వసూళు అయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇంకా చాలా మంది ప్రజలు తమ వాహనాలకు సంబంధించి పెండింగ్ చలాన్స్ చెల్లించాల్సి ఉంది. లాస్ట్ డేట్ కావడంతో అందరూ ఒకేసారి ఈ-చలాన్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేశారు. దాంతో సైట్ స్లో అయ్యింది. దీంతో పెండింగ్ చలాన్స్ చెల్లించేందుకు గడువు పొడిగించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ప్రజల కోరిక మేరకు ప్రభుత్వం పెండింగ్ చలాన్ చెల్లింపునకు గడువును జనవరి 31వరకు పొడిగించింది. దీంతో వాహనదారులు హమ్మయ్య అనుకున్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 3.59 కోట్ల పెండింగ్ చలాన్లు ఉండగా.. ఇప్పటి వరకు 2 కోట్లకు పైగా చలాన్లు క్లియర్ అయినట్లు అధికారులు తెలిపారు. దీని ప్రకారం ఇవాళ్టి వరకు రూ. 107 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఇంకా కోటికి పైగా చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు అధికారులు. పెంచిన గడువుతో అవి కూడా క్లియర్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు అధికారులు. కాగా గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2022 లో మార్చి 1 నుంచి 31 వరకు చలాన్ల చెల్లింపునకు డిస్కౌంట్స్ ఇచ్చింది. గడువు ముగిసిన తరువాత మరో 15 రోజుల పాటు గడువు పొడిగించింది.

## రామయ్య బంగారు పాదుకలకు గవర్నర్ ప్రత్యేక పూజలు



హైదరాబాద్ : అయోధ్య రామ మందిరానికి భక్తుడు కానుకగా ఇస్తున్న బంగారు పాదుకలకు గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి అయోధ్య రామమందిరానికి కానుకగా ఇచ్చేందుకు బంగారు పాదుకలు తయారు చేయించారు.

ఆ పాదుకలకు గవర్నర్ తమిళిసై రాజ్‌భవన్‌లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రామమందిరం గర్భగుడిలో ఉంచే బంగారు పాదుకల్ని ప్రతి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారని గవర్నర్ అన్నారు. శ్రీరాముడికి అంకితభావంతో శ్రీనివాస శాస్త్రి చేసిన సేవల్ని ఆమె కొనియాడారు. శ్రీరాముడి పాదుకలకు జరిపిన పూజా కార్యక్రమంలో రాజ్‌భవన్ అధికారులతోపాటు రాజ్‌భవన్ పరివార్ పాల్గొన్నారు.

## కొన్ని తప్పిదాల వల్లే ఎన్నికల్లో ఓటమి.. కేటీఆర్ కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తాము చేసిన కొన్ని తప్పిదాల వల్లే బీఆర్ఎస్ ఓటమి చెందినట్టు చెప్పుకొచ్చారు మాజీ మంత్రి కేటీఆర్. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ ఎక్కువ స్థానాల్లో గెలుస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు పార్టీ నేతలు, శ్రేణులకు భరోసా ఇచ్చారు. కాగా, తెలంగాణ భవన్‌లో ఎనిమిదో రోజు వరంగల్ పార్లమెంట్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేటీఆర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస రెడ్డి, మధుసుధనా చారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్ రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు. శాసనసభ ఎన్నికల్లో కలిసి మాట్లాడుకునే అవకాశం రాలేదు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ సమావేశాలు నిర్వహిస్తున్నాం. తల్లడిల్లి ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల పాటు చల్లగా కాపాడుకున్నాం. కొన్ని తప్పిదాల కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందాము. ఇప్పుడు తెలంగాణ మళ్లీ ఢిల్లీ నేతల చేతుల్లోకి వెళ్లింది. మన తెలంగాణ మన చేతులోకి తెచ్చుకునే సమయం ఆసన్నమైంది. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోండి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలు నమ్మే పరిస్థతిలో లేరు, ప్రజలు ఆలోచిస్తున్నారు. తెలంగాణ గళం, బలం ఢిల్లీలో వినపాడలంటే మనం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉన్నది. సమీక్షా సమావేశంలో మీకు మాట్లాడే అవకాశం ఇస్తున్నాము. మీరు చెప్పిన ప్రతీ అభిప్రాయం నోట్ చేసుకుంటాం' అని వ్యాఖ్యలు చేశారు. అలాగే, ఈ సమవేశానికి ఆలస్యంగా వచ్చిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి లేటే, మీటింగ్‌కు కూడా ఆలస్యంగానే వస్తారా? అని చురకలు అంటించారు.

## ధరణిపై అధ్యాయన కమిటీ వేసిన సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు..



హైదరాబాద్ : ధరణిపై అధ్యాయన కమిటీ వేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ వల్ల కాంగ్రెస్ పేదలకు ఇచ్చిన భూములు అన్నీ అన్యక్రాంతం అయ్యాయన్నారు. ఇందిరాగాంధీ హయాంలో 96 ఎకరాలు కీసరలో పేద ప్రజలకు ఇచ్చిందని గుర్తుచేశారు. ఓఆర్ఆర్‌తో అక్కడి పేద రైతులు భూములు కోల్పోయారన్నారు. కీసర ఔటర్ రింగ్ రోడ్డు అనుమతుల్లో పెద్ద స్కామ్ జరిగిందని ఆరోపించారు.

దానిపై న్యాయ విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆర్డర్లు ఉన్న లే అవుట్ కోసం హెచ్ఎండీఏ అనుమతులు ఇచ్చిందన్నారు. కీసర ఓఆర్ఆర్‌తో భూములు కోల్పోయిన పేద ప్రజలకు న్యాయం చేయాలని అధ్యాయన కమిటీకి లేఖ రాసినట్లు తెలిపారు. ధనవంతులకే లాభం చేసే ధరణిని ఎత్తివేయాలని వి.హనుమంతరావు పేర్కొన్నారు.

## మాటలే కాదు.. గ్యారెంటీలను చేసి చూపిస్తాం



ఖమ్మం: ప్రజా పాలనతో పాటు మనం కోరుకున్న ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం మల్లెమడుగులో పల్లె దవాఖానా ప్రారంభోత్సవం సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంతో పేదలకు మంచి జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం మాటలతోనే కాకుండా పేదలకు ఇచ్చిన గ్యారెంటీలను చేసి చూపిస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వ అధికారులే ప్రజల వద్దకు వస్తారని పొంగులేటి తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తులతో పేదల న్యాయమైన కోరికలను ఈ ప్రభుత్వం తీర్చుతుందన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి పోయిందని మాటలు చెప్పి తప్పించుకునే ప్రభుత్వం కాదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని.. ఎన్ని అవాంతరాలు ఎదురైనా పేదలకు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా నెరవేర్చుతామని పొంగులేటి తెలిపారు.

## ఖరీఫ్ పంటకాలానికి ఖమ్మం జిల్లాలోకి గోదావరి జలాలు



ఖమ్మం : ఎంత డబ్బు, అహంకారం, అధికారం ఉన్నా ప్రజల ముందు దిగదుడుపే అని తెలంగాణ ప్రజలు నిరూపించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అందరం ఏది కాదనుకున్నామో, వద్దనుకున్నామో దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులలో ఎవరైతే నిజంగా అర్హులో వారిని గుర్తించాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారులు కూడా నిజమైన అర్హులకు ఇస్తే అది ఇందిరమ్మ రాజ్యం అవుతుందన్నారు.

ఆరు గ్యారెంటీలు పేద ప్రజలు కోరుకునే కనీస అవసరాలని చెప్పుకొచ్చారు. గత ముఖ్యమంత్రి మాటలకే పరిమితమై కొన్ని కార్యక్రమాలు తుంగలో తొక్కారని విమర్శించారు. ఈనాటి ముఖ్యమంత్రి ప్రజల వద్దకు పంపించి ప్రజల ముందే ఆ కార్యక్రమాలు చేసుకోమని చెప్పారన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ పంటకాలానికి ఖమ్మం జిల్లాలోకి గోదావరి జలాలు ప్రవేశిస్తాయని స్పష్టం చేశారు. "తప్పకుండా మా పదవీ కాలంలోనే ఆ నీళ్లు మీకు రావాలని మేము ప్రయత్నం చేస్తున్నాం" అని చెప్పారు. జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమం అన్నింటినీ పూర్తి చేసే బాధ్యత తాము తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్‌లో దడ మొదలైంది: మంత్రి పొన్నం



కరీంనగర్ జిల్లా: కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణతో బీఆర్ఎస్‌లో దడ మొదలైందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు 9 నెలలు కూడా పనిచేయలేదన్నారు. ప్రాజెక్టు అక్రమాలపై సిట్టింగ్ జడ్జి విచారణ జరిపిస్తామన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడేందుకు బీజేపీ నేతలు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చి నెలరోజులవుతుంది. గ్యారంటీ స్కీమ్‌లపై దరఖాస్తులు స్వీకరించాం. చిత్తశుద్ధితో అమలు చేస్తాం. మాజీ ఎంపీ వినోద్ కుమార్ సచ్చీలుడైతే తనపై వచ్చిన ఆరోపణలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి. తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. జెన్ కోతో పాటు ఇతర శాఖల్లో అక్రమంగా ఉద్యోగం పొందిన వారు వెంటనే ఉద్యోగాలు వదిలిపెట్టి వెళ్ళాలి. భూ అక్రమార్కులపై చర్యలు చేపడుతాం" అని మంత్రి హెచ్చరించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com